ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 | సంచిక : 12 | ఆగష్టు 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 32
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాలకొల్లు ....... 23-11-2008
మండపేట ....... 06-04-2009
చించినాడ ...... 11-03-2009
హైదరాబాద్ .... 07-07-2009
కైకలూరు ........ 30-06-2009

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-11-2008, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన శరీరం చనిపోవటంతో ఈ జీవుడి యొక్క యాత్ర ఆగదు. శరీరం చనిపోతే ఆ శరీరగతమైన యాత్ర ఆగిపోతుంది కాని జీవుడి యొక్క యాత్ర అలా కంటిన్యూ అవుతుంది. మనలో ఉన్న వాసనలు సంస్కారాలు అన్నీ కలిసి మరల కొత్త శరీరాన్ని తీసుకొనివస్తాయి, అదే పునర్జన్మ. పూర్వజన్మలు ఉన్నమాట నిజం, రాబోయే జన్మలు ఉన్న మాట నిజం, ఎవరైనా లేవు అంటే అది తెలియనితనం. దేవుడు ఉన్నాడా, లేడా అంటే మౌనం వహించిన బుద్ధుడు జన్మలు ఉన్నాయని చెప్పాడు. మనకు వర్షాకాలం తరువాత శీతాకాలం, శీతాకాలం తరువాత వేసవికాలం ఎలా వస్తున్నాయో అలాగే ఈ శరీరం చనిపోతే కొత్త శరీరాలు వస్తూ ఉంటాయి, అది ప్రకృతి. తన స్వరూపంలో ఉన్న శాంతి, ఆనందం వాడికి అనుభవం లోనికి వచ్చేవరకు వాడు ధనవంతుడైనా, పండితుడైనా, వాడికి అధికారం ఉన్నా, వాడు ఎంతటివాడైనా వాడికి పునర్జన్మలు ఆగవు. శరీరం వచ్చింది అంటే నాలుగు రోజులు వెనకోముందో చనిపోవటం ఖాయం. ఇంకో గంటలో చనిపోయేవాడు కూడా ప్రస్తుతానికి మనకు ఏమీ ఇబ్బంది లేదు అనుకొంటాడు, అదే మాయ. మనం భగవంతుడు చెప్పినమాటలు నమ్మము దానికి మన బుద్ధిలో ఉన్న దోషాలు కారణం. ఎన్నో జన్మలనుండి మనం సత్కర్మ నిష్కామంగా చేసుకొంటూవస్తేగాని మనకు భగవంతుడి పట్ల విశ్వాసం కలగదు. మనకు శరీరం గురించి తెలుసు, మనస్సు గురించి తెలుసు కాని అందరిలోను అంతర్యామిగా ఉన్న పరమాత్మకు సంబంధించిన ఎరుక మనకు లేదు. దేహం ఎలాగ ఉందో, మనస్సు

ఎలాగ ఉందో లోపల ఉన్న వస్తువు కూడా అలాగే ఉంటుంది అనుకుంటున్నాము. దేహానికి సంబంధించిన రోగాలు, చావులు, పుట్టుకలు, మనస్సుకు సంబంధించిన ఇష్టాలు, అయిష్టాలు వీటితో లోపలఉన్న వస్తువుకు ఏమీ సంబంధం లేదు కాని వీటిని తీసుకొని వెళ్ళి అందులో కలపటంవలన మనకు కన్‌ఫ్యూజన్ వచ్చేస్తోంది. లోపలఉన్న వస్తువు శరీరంలాగ ఉందేమో, మనస్సులాగ ఉందేమో అని ఇలా ఊహించుకోవటం వలన మనం సబ్జక్టు విన్నా క్లారిటీ రావటంలేదు. మనం ఊహించు కొన్నట్లుగా ఆ వస్తువు లేదు, అది ఎలా ఉండాలో అలాగ ఉంది. వస్తువు మనలోపలే ఉంది, అది శాంతిగా ఉంది, ఆనందంగా ఉంది, స్వతంత్రంగా ఉంది. మనం దానికోసం గుడులలో, గోపురాలలో, సమాజంలో ఇలా ఎక్కడో బయట వెతుకుచున్నాము దీనికి మన మనస్సు యొక్క చాపల్యం కారణం.

ధనవంతులు అందరూ మేము ధనవంతులము అనుకొంటారు. వారికి ధనం ఉంటే ప్రమాదంలేదు, నేను ధనవంతుడిని అనుకొంటే ప్రమాదం, ఏ జ్ఞాని కూడా నేను జ్ఞానిని అని అనుకోడు. అంటే అక్కడ దేహగతమైన నేను ఉండదు. అంటే అనుకొనేవాడు అక్కడ లేడు వాడు ఎప్పుడోపోయాడు, వాడుపోతేగాని మనకు జ్ఞానం రాదు. మీలో ఎవరికైనా ధనం ఉంది అనుకోండి, ఉండనివ్వండి. నేను ధనవంతుడిని అని మీరు అనుకుంటే మీ బ్రెయిన్ నెమ్మదిగా పాయిజన్ అయిపోతుంది, మీరు చెడిపోతారు. భక్తిమార్గంలో చాలామంది ప్రయాణిస్తూ ఉంటారు. అందులో చాలాకొద్దిమంది మాత్రమే సిన్సియర్‌గా సాధన చేస్తూ ఉ ంటారు. అలా సిన్సియర్‌గా సాధన చేసే లక్షలాదిమందిలో ఎవరో ఒకరికో, ఇద్దరికో రీలైజేషన్ వస్తుందికాని రీలైజేషన్ పొందటం మీరు అనుకొన్నంత తేలికకాదు. వివేకానందుడు చదువుకొనే రోజులలో ఎప్పడైనా వచ్చి రామకృష్ణుడిదగ్గర కూర్చునేవాడు. ఒకరోజు వివేకానందుడు రామకృష్ణుడి దగ్గర కూర్చుని నవ్వుతున్నాడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే బుల్లి వివేకానందుడు నవ్వుతున్నాడురా, మీరు అందరు నావంక చూడవద్దు, వాడి నవ్వును చూడండి. ఆ నవ్వు చాలా అందంగా ఉంది, స్వీట్‌గా ఉంది. మీలో ఎవ్వరూ అలాగ నవ్వలేరు. వాడి మనస్సులో ఏ కాంక్ష లేదు, లోకానికి సంబంధించిన ఏ గొడవ అక్కడలేదు అందుచేత ఆ నవ్వు అంత అందంగా ఉంది. అలా నవ్వటం మీకు సాధ్యం కాదు. వాడు పూర్వజన్మలో చేసిన కృషినిబట్టి అది వచ్చింది ఈ ఒక్క జన్మలో వచ్చింది కాదు అని చెప్పాడు. మీరు రీలైజేషన్ పొందటానికి ప్రయత్నం చేస్తున్నారు అనుకోండి, ఆ ప్రయత్నం వెంటనే ఫలించకపోయినా దాని తాలుక ఫలితం వచ్చే జన్మలో మన కూడా వచ్చేస్తుంది, దాని ప్రభావం ఎప్పడో ఒకప్పడు ఉంటుంది. మనం ఈ ప్రపంచంలోనికి వచ్చి వెళ్ళిపోయామనే జాడకూడా ఇతరులకు తెలియవలసినపనిలేదు. మమ్మల్ని

ఇంట్లోవారు ప్రేమించటం లేదు, సమాజం ప్రేమించటంలేదు అని అంటారు, వారి ప్రేమ మీద ఆధారపడి ఎంతకాలం బతుకుతాము, మనంతట మనం బతకాలి. లోపల ప్రేమలేనప్పుడు, ఆప్యాయత లేనప్పుడు పనిమనుషులకీ, ఇంట్లోవారికీ తేడాలేదు.

ఆత్మజ్ఞానం పొందాలి అంటే ముందు మనమీద మనకు విశ్వాసం ఉండాలి. బలహీనులకు, బద్ధకస్తులకు, ఆత్మవిశ్వాసం లేనివారికి ఆత్మజ్ఞానం కలుగదు. గుడిచుట్టూ తిరగటం, ఎక్కడరాయికనిపిస్తే అక్కడ రాళ్ళకు మొక్కటం ఇది జ్ఞానం కాదు. మీలో దేహభావన ఉన్నప్పుడు గుడిలో ఉన్న దేవుడిని చూసిరండి. అంతర్యామిగా ఉన్న నారాయణుడిని దర్శించలేనప్పుడు ఇలా గుడులచుట్టూ తిరగవలసిందే. మీకు ఎవరికైనా అశాంతివస్తే మీ కోడలును పట్టుకొని తిట్టేయకండి, అలా తిట్టటం వలన ఏమీ లాభం లేదు, ఎందుచేతనంటే వారివలన మనకు అశాంతి రావటంలేదు. చాలామంది మా అబ్బాయిలు చూడటంలేదు, మా కోడలు చూడటంలేదు అంటారు. వారు చూడటం లేదు, వీరు చూడటంలేదు అని అనటంవలన నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. అసలు వారిమీద ఆధారపడవలసిన పని ఏమిటి? నీకు ఆత్మబలం లేకపోవటంవలన, ఆత్మవిశ్వాసం లేకపోవటం వలన ఇది అంతా వస్తోంది. వారు చూడకపోతే ఏ గొడవలేదు, చూస్తేనే ఎక్కువ ప్రమాదం. వారు బాగాచూడటంవలన వారిమీద నీకు మమకారం పెరుగుతుంది. మమకారం పెరిగితే దేవుడిమీద భక్తి తగ్గిపోయి చివరిక్షణాలలో ఎవరిమీద మమకారం ఉందో వారే నీకు జ్ఞాపకం వస్తారు కాని దేవుడు జ్ఞాపకం రాడు.

భారతయుద్ధంలో రక్తం అలా ప్రవహిస్తూ ఉంటుంది. ఆ రక్తాన్ని చూసి ఇదంతా నా గురించేకదా, కౌరవులు రాజ్యం ఇవ్వనన్నారు, వదిలేసి ఉంటే ఈ యుద్ధం గొడవ లేదు. ఇంతమంది చనిపోవటం, ఈ రక్తప్రవాహం ఇదంతా నా గురించే జరిగింది అని ధర్మరాజుకు దుఃఖం వచ్చింది. ఈ దుఃఖం చల్లార్చటానికి కృష్ణుడు ధర్మరాజును భీష్ముడిదగ్గరకు తీసుకొని వెళతాడు. భీష్ముడు ధర్మరాజుకు ఎన్నో నీతులు చెపుతాడు కాని ఆయనకు దుఃఖం తగ్గలేదు. ఎన్ని చెప్పినా నా మనస్సు ఆగటం లేదు అని ధర్మరాజు అంటాడు. అప్పుడు భీష్ముడు ఏమన్నాడు అంటే నీ అశాంతికి కారణం ఇప్పుడు నాకు అర్థమవుతోంది. ఈ యుద్ధానికి నువ్వే కారణం అనుకొంటున్నావు. నువ్వు కారణం కాకపోయినా నేనే కారణం అని నువ్వు అనుకోవటం వలన నీకు అశాంతి వస్తోంది, నీకు దుఃఖం వస్తోంది అని అప్పుడు భీష్ముడు ఒక కథ చెప్పాడు. ఒక తల్లీకొడుకు నడిచివెళుతున్నారు, ఆ దారిలో పుట్టలు ఉన్నాయి, ఒక పాము ఆ పుట్ట పక్కనే తిరుగుతోంది. వీరిని చూసి అదిరి ఆ పాము వచ్చి కొడుకును కరిచింది, ఆ అబ్బాయి

చనిపోయాడు. మా అబ్బాయి చనిపోయాడు అని ఆ తల్లి ఏడుస్తూ ఉంటే ఒక బోయవాడు వచ్చి ఆ పుట్ట దగ్గరకి వెళ్ళి పామును పట్టుకొన్నాడు. అప్పుడు తల్లి దగ్గరకు వెళ్ళి మీ అబ్బాయిని ఈ పాము చంపింది, ఇప్పుడు నేను ఈ పామును చంపేస్తాను, మీకు దుఃఖం చల్లారిపోతుంది అని చెప్పాడు. పామును చంపటం వలన మా అబ్బాయి బతుకుతాడా అని తల్లి అడిగింది. మీ అబ్బాయి బతకడు మీకు కక్ష తీరినట్లు అవుతుంది అని చెప్పాడు. అప్పుడు ఆ తల్లి ఏమంది అంటే మా అబ్బాయి బతుకుతాడు అంటే ఆ పామును చంపవచ్చు, లేనిచో దానిని చంపటం వలన ప్రయోజనం లేదు, ఆ పామును వదిలేయండి అని చెప్పింది. అప్పుడు ఆ పాము ఏమంది అంటే నేను చంపాను అని మీరు అనుకొంటున్నారు, మీ అబ్బాయి నాకు ఏమీ అపకారం చేయలేదు. అందరినీ కరవటమే నా పనికాదు, మీ అబ్బాయి యొక్క మృత్యువే నన్ను ప్రేరేపించింది, దీనికి నేను కారణంకాదు అని చెప్పింది. తరువాత మృత్యువు వచ్చింది. నన్ను యమధర్మరాజు పంపాడు. వాడి టైము అయిపోయింది చంపేయమని చెప్పాడు. అందుచేత ఆ పామును ప్రోత్సహించాను ఇందులో నా తప్పు ఏమీ లేదు అని మృత్యువు అంటాడు. తరువాత యముడు వచ్చాడు. పాము ఏమో మృత్యువు కారణం అని చెప్పింది, మృత్యువు ఏమో యముడు కారణం అని చెప్పాడు. అబ్బాయి ప్రాణం తీయటం ఏమిటి, అమ్మ ప్రాణం తీయవచ్చును కదా. అబ్బాయి ప్రాణం తీయటానికి కారణం ఉంది. మీరు అనుకొనేది నిజంకాదు అని యముడు తల్లితో ఏమి చెప్పాడు అంటే మీ అబ్బాయి ప్రాణం పోవటానికి పాము కారణం కాదు, మృత్యువు కారణంకాదు, నేను కారణం కాదు, పూర్వజన్మలలో వాడు చేసిన కర్మను బట్టి వాడికి ఆయుర్ధాయం ఉంటుంది. వాడు చేసిన కర్మనుబట్టి వాడికి అంతే ఆయుర్ధాయం ఉంది. వాడు చనిపోవటానికి వాడి కర్మేకారణం అని యముడు చెప్పాడు. కౌరవులనందరినీ నేను చంపేసాను అని ధర్మరాజు అనుకొంటున్నాడు వారి కర్మవలన కౌరవులు చనిపోయారు కాని నీవల్లకాదు. నావల్ల చనిపోయారు అనుకోవటం వలన నీకు దుఃఖం వస్తోంది అన్నాడు. ఈ కధతోటి ధర్మరాజు దుఃఖం ఆగిపోయింది.

మేము వారందరికి ఉపకారం చేసాము, వారు తిరిగి మాకు అపకారం చేస్తున్నారు ఏమిటి అని చాలామంది అంటారు. అది ప్రపంచం యొక్క స్వభావం. పిల్లలను జాగ్రత్తగా కష్టపడి పెంచితే తరువాత తల్లిని చంపిన పిల్లలు అనేక మంది ఉన్నారు. వాటిని చూసి ఆశ్చర్యపోకూడదు. అది ప్రపంచం యొక్క స్వభావం. మనలో ఉన్న గుణాలే ప్రపంచం కింద కనిపిస్తూ ఉంటుంది అంతకంటే ప్రపంచం అంటే ఏమీ లేదు. భగవంతుడు ఎక్కడైతే మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడో అదే మన నిజమైన ఇల్లు, అక్కడకు చేరుకోండి, అక్కడకు

చేరితే ఆ ప్రపంచం గొడవ, చావుపుట్టుకల గొడవ ఏ గొడవ అక్కడ లేదు. మేము వారికి మంచి చేసాము, వీరికి మంచి చేసాము, వారు అపకారం చేస్తున్నారు అని ఇలా అనుకోవటం వేస్టు. ప్రపంచం అంటే అలాగే ఉంటుంది. మిమ్మల్ని ఫుట్‌బాల్ తన్నినట్లుగా ఈ ప్రపంచం తన్నేస్తూ ఉంటుంది. ఇవన్నీ మీరు సహనంగా తట్టుకోగలిగితే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మీరు ఏదైనా మంచి జరిగినప్పడు అదంతా మా తెలివితేటలు అనుకుంటారు. మీకు ఏదైనా చెడ్డ జరిగినప్పడు అది దేవుడే చేసాడు అనుకొంటున్నారు. మంచి జరిగినప్పడు దేవుడు కారణం అని అనుకోవటం లేదు మరి చెడ్డ జరిగినప్పడు దేవుడే కారణం అని ఎందుకు అనుకొంటున్నారు, దీనికి మన పాడుబుద్ధి కారణం. మీ దేహం మీదకు గొడవలు వస్తే రానివ్వండి, అవి వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. నువ్వు దేహం అనుకోవటం వలన, మనస్సు అనుకోవటం వలన ఇది అంతా వస్తోంది. బయట విపరీతంగా వర్షం వస్తోంది అనుకోండి, నువ్వు ఇంటిలో ఉంటే ఆ వర్షం నిన్ను ఏమి చేస్తుంది. అలాగే మీ హృదయంలో మీరు ఉంటే, మీ నిజమైన ఇంటిలో మీరు ఉంటే ఏవో గొడవలు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. గొడవలు రాకూడదు అని నీవు అనుకోవద్దు, ప్రారబ్దంలో ఉన్నవి వస్తాయి, వచ్చి అక్కడ కూర్చోవు, వెళ్ళిపోతాయి. మీ హృదయంలో మీరు ఉన్నప్పడు అవి ఏమీ మిమ్మల్ని తాకవు, వాటి ప్రభావం మీ మీద ఏమీ ఉండదు. భీష్ముడు చెప్పిన కథ మీకు అర్థమైందా. మీ కోడలు నిజంగా మంచిది కాదు అనుకోండి ఆ కోడలే మీ ఇంటికి రావటం ఏమిటి, ఇంక దేశంలో కొంపలు లేవా? అంటే మీరు చేసిన కర్మ ఆ కోడలిని తీసుకొని వచ్చింది అని మర్చిపోకండి, ఆ కోడలు తప్పేమీ లేదు, మీ కర్మే ఆ కోడలు రూపంలో వచ్చింది, అంతే. ఒకవేళ మీ కోడలు మంచిది అనుకోండి, మీ కర్మే ఆ మంచికోడలిని తీసుకొని వచ్చింది. ఇది మీరు అర్థం చేసుకొంటే 90% దుఃఖం తగ్గిపోతుంది. నువ్వు చేసిన కర్మ అది అనుభవంలోనికి వచ్చేవరకు నిన్ను వెంటాడుతుంది, అనుభవానికి వచ్చాక అది పోతుంది. నువ్వు కర్మ చేసావా అనుభవించక తప్పదు. ఈలోపుగా మీకు జ్ఞానం వస్తే నేను కర్మ అనుభవిస్తున్నాను అనేవాడు అక్కడ ఉండడు, అప్పడు కర్మ అనుభవిస్తున్నా, నేను అనుభవిస్తున్నాను అనే భావన మీకు రాదు, అదీ జ్ఞానం యొక్క వైభవం. నువ్వు ఏ పని చేస్తున్నా, ఏది మాట్లాడుతున్నా నీ దృష్టి అంతా కూడా ఆత్మజ్ఞానం వైపు ఉండాలి.

నరుడిలో ఉన్న నారాయణుడిని మనం చూడలేకపోతున్నాము. మరి ఎక్కడో ఒకచోట చూడాలి కదా అందుచేత గుడులచుట్టూ తిరుగుతున్నాము. నువ్వు గుడికి వెళ్ళి దేవుడిని చూడవచ్చు, అది రెండో పక్షం. ఆ మనిషికి ఉపకారం చేసాను, ఈ మనిషికి ఉపకారం చేసాను అనుకోవద్దు. నువ్వు మనిషిలో ఉన్న దేవుడిని చూసి, దేవుడినే

ఆరాధిస్తున్నాను అనే భావనతో చేస్తే అది మొదటి రకం భక్తి. లక్ష్మీనర్సింహస్వామి హిరణ్యకశిపుడిని సంహరించాక ప్రహ్లాదుడిని అడుగుతాడు నీ భక్తికి సంతోషించాను నీకేమికావాలో కోరుకో ఇస్తాను అంటాడు. మీరు దర్శనమిచ్చారు అంతకంటే నాకు ఏమికావాలి. నీకు ఏమైనా కావాలా అడుగు ఇస్తాను అంటున్నారు. అడగటానికి మీకంటే మించినదికాని, మీతో సమానమైనదికాని ఏమైనా ఉందా? ఏదో ఒకటి అడగటానికి ఇది ఏమైనా వ్యాపారమా అంటాడు ప్రహ్లాదుడు. భక్తి అంటే వ్యాపారమా. భగవంతుడిపట్ల ప్రహ్లాదుడికి ఉన్న భక్తి అటువంటిది, ప్రేమ అటువంటిది. అది స్వచ్ఛమైన భక్తి, పవిత్రమైన ప్రేమ. అందుచేత ప్రహ్లాదుడికి భక్తులలో అగ్రస్థానం ఇచ్చారు. మన జీవితంలో రోజులు గడిచేకొలది మృత్యువు దగ్గర అవుతున్నాము. అందుచేత కాలాన్ని వృధాచేసుకోవద్దు. డబ్బుపోతే సంపాదించుకోగలముకాని జరిగిపోయిన కాలం తిరిగిరాదు. అందుచేత కాలాన్ని మేగ్జిమమ్ సద్వినియోగం చేసుకొంటూ భగవంతుడికి దగ్గర అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. మనం ఎండిపోయిన పుల్లలలాగ, బండరాళ్ళలాగ తయారవుతున్నాము, మనకు రసహృదయం లేదు. ఈశ్వరుడిపట్ల మనకు ఉన్న భక్తి వలన, ఆయనపట్ల మనకు ఉన్న విశ్వాసం వలన ఆయన ఒక గిఫ్టు కింద మనకు రసహృదయం ఇస్తాడు అంతవరకూ మనకు రసహృదయం రాదు. రసహృదయం రాకుండా ఆయన అనుగ్రహం మనకు రాదు.

మనం భగవదనుభవం పొందటానికి చేసే ప్రయత్నంలో చిత్తశుద్ధి ఉండాలి, మెకానికల్‌గా చేయకూడదు. మీరు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తూ ఉంటే మీకు భగవదనుభవం కలుగుతుంది. బయట కారణాల వలన నీకు దుఃఖం రావటంలేదు. కర్తృత్వం వలనే నీకు దుఃఖం వస్తోంది. కర్తృత్వం పోతే దుఃఖం రాదు. ఆ స్థితికి మిమ్మల్ని మేల్కొలప టానికే ఈ బోధ అంతా. ఈ శరీరం భూమిమీద తిరుగాడుతున్నప్పడే భగవదనుభవం, ఆనందానుభవం నీకు కలుగజేయటానికే భగవాన్ బోధ. భగవాన్ ఏమన్నారు అంటే మాకు ఆత్మజ్ఞానం ఇచ్చేయండి, ఆత్మజ్ఞానం ఇచ్చేయండి అని అడుగుతున్నారు, మీకు ఆత్మజ్ఞానం ఇచ్చేస్తాము అనుకోండి చిన్న గుడిసెలోనికి ఏనుగును తోలితే ఏమౌతుంది అన్నారు, గుడిసె అంతా పడిపోతుంది. మీరు కంగారుపడుతున్నారు అని నేను కంగారుపడితే అంతే అని చెప్పారు. భగవంతుడు నెమ్మదిగా చేస్తాడు. మీరు చేసే ప్రయత్నం సిన్సియర్‌గా ఉండాలి. మీ విశ్వాసం నిజమైతే మీరు ఒక్క అడుగు వేస్తే మీకోసం ఆయన తొమ్మిది అడుగులు వేసి ఎదరకు వస్తాడు. ఈశ్వరానుగ్రహం ఎప్పడూ ఉంది కాని మనం దానిని అందుకోలేక పోతున్నాము, దానిని అందుకొనే యోగ్యత పొందటమే మన సాధన యొక్క గమ్యం. మీరు

ఆత్మవిశ్వాసం విడిచిపెట్టవద్దు. మీరు చేసే సాధన మీద మీకు ఉన్న నమ్మకం విడిచిపెట్టవద్దు. ఏదో ఎల్లమ్మ అందని, పుల్లమ్మ అందని రకరకాల గొడవలలోనికి వెళ్లవద్దు. ఎల్లమ్మ, పుల్లమ్మ మీకు మోక్షం ఇవ్వరు. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే మనకు మోక్షం ఇస్తాడు. అందుచేత మీ నిదానంలో మీరు ఉండండి. మీరు స్లోగా, స్టడీగా ప్రయత్నం చేయండి, గమ్యాన్ని మర్చిపోవద్దు. మనం మనస్సు అనే జైలులో ఉన్నాము, అది ఎలా చెపితే అలా చేయటానికి అలవాటు పడిపోయాము. ఇలా మనస్సుకు పాలేరుతనం చేస్తూ ఏదోరోజున చనిపోతున్నాము. ఈ మనస్సు అనే జైలునుండి బయటకు వస్తే నువ్వు ఈ ప్రకృతిని దాటిపోతావు, అప్పడు నీకు నిజమైన స్వేచ్ఛ, నిజమైన ఆనందం కలుగుతుంది. మనస్సును దాటి బయటకు వస్తే నువ్వు పదిలక్షల మంది మధ్యలో ఉన్నా ఒంటరిగా ఉన్నాను అనిపిస్తుంది. మనస్సు నుండి బయటకు రాకుండా నువ్వు గదిలో కూర్చుని తలుపులు వేసుకొన్నా నీ బుర్రనిండా అడివి మిగులుతుంది. అందుచేత మనస్సు అనే జైలునుండి బయటకు రావటానికి సిన్సియర్‌గా ప్రయత్నం చెయ్యి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-04-2009, మండపేట)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆంజనేయస్వామి అఖండ బ్రహ్మచారి, మహామేధావి, బుద్ధిమంతుడు, బలవంతుడు, వ్యాకరణ శాస్త్రవేత్త. ఆయనకు వ్యాకరణశాస్త్రంలో ఉన్న పరిజ్ఞానం చూసి రాముడు ఆశ్చర్యపోయాడు. ఆంజనేయస్వామిలో మనం నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. రామనామాన్ని ఆంజనేయస్వామి ప్రచారం చేసినంతగా ఎవరూ చేయలేదు. ఆంజనేయస్వామికి దేవుడి పని తప్పించి సొంతపని అంటూ ఏమీ లేదు. అహంకారాన్ని పోగొట్టుకోవటం తేలిక అని మీరు అనుకుంటున్నారు కాని అది మీరు అనుకున్నంత తేలిక కాదు. కుక్క తోక వంకర తీయటం ఎంత కష్టమో అహంకారాన్ని పోగొట్టుకోవటం అంత కష్టం అని రామకృష్ణ పరమహంస చెప్పారు. మనకి అహంకారం ఒకోసారి అణిగి ఉంటుంది. అప్పడు అహంకారంలోంచి బయటకు వచ్చేసాము అని మనకి అనిపిస్తుంది. ఇలా అనుకొంటూ మనలను మనం మోసం చేసుకొంటున్నాము. అహంకారం భయంకరమైన క్రూర సర్పము అన్నారు ఆచార్యులవారు. ఒక మహాసర్పము వచ్చి మీ శరీరాన్ని చుట్టబెట్టుకుంటే మీరు దానిలో నుండి బయటకు రాగలరుకాని అహంకారంలో నుండి బయటకు రాలేరు అని చెప్పారు. కోరిక, కోపము, లోభిత్వము ఇవి నిన్ను చంపక ముందే వాటిని చంపేయి

అన్నారు శాస్త్రంలో. కోపాన్ని నువ్వు చంపలేవు అనుకో అదే వచ్చి ఏదోరోజున నిన్ను చంపేస్తుంది. కామాన్ని నువ్వు చంపలేవు అనుకో నిన్ను ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలోనైనా కాల్చివిడిచిపెడుతుంది. అసూయని కనుక నువ్వు చంపకపోతే అసూయవల్లే నువ్వు కాలిపోయి చచ్చిపోతావు. అందుచేత మనం సాధన చేసి వాటిని పోగొట్టుకోలేకపోతే అవే మనల్ని చంపేస్తాయి. మీరు సాధన దగ్గర శ్రద్ధగా ఉండాలి. శ్రద్ధగా ఉంటే మనకి మోక్షం వస్తుంది. అహంకారాన్ని జయించాలంటే తిండి దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కాపాడుకోవాలి.

మనం ఇతరులను విమర్శించకూడదు, మనలను మనమే విమర్శించుకుంటూ ఉండాలి. ఇతరులను విమర్శించుట వలన మన మనస్సు పొల్యూట్ అయిపోతుంది. ఇతరులు బాగా చెడ్డవాళ్ళు అనుకో నీకు నష్టం ఏమిటి? నువ్వు బాగుపడు నిన్ను నువ్వు విమర్శించుకోవటం వల్ల నీకు తేజస్సు వస్తుంది, నీకు హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. ఇతరుల్ని విమర్శిస్తూ కాలాన్ని పాడుచేసుకునేబదులు రోజుకొక మంచిపని చెయ్యి అప్పుడు నీ బుద్ధి నిర్మలమవుతుంది. పరమాత్మ గీతలో సంహరతే, సంహరతే అన్నాడు. తాబేలు తనకు ఏదేనా ప్రమాదం వచ్చినప్పుడు తన తలని, తన కాళ్ళని లోపలికి ఎలాగ లాగేసుకుంటుందో అలాగే విషయాలమీదకి ఏ ఇంద్రియం పరిగెడుతోందో ఆ ఇంద్రియాన్ని బయటకు వెళ్ళనివ్వకుండా లోపలికి ఉపసంహరించు. బయటకు వెళ్ళనిస్తే అది విజృంభించేస్తుంది. మీరు ఇంద్రియాలను వెనక్కి లాక్కోండి. మీకు ఇంద్రియనిగ్రహం లేకుండా మనస్సుని నిగ్రహించుకుందామన్నా అది సాధ్యం కాదు. మీ ఇంద్రియాలని, మీ మనస్సుని నమ్మకండి అని కాళిదాసు చెప్పాడు. మీకు జున్ను ఇష్టం అనుకోండి. జున్ను కనిపించకపోతే మీరు తినరు. జున్ను కనిపిస్తే మీకు తెలియకుండా చెయ్యి అక్కడ పడిపోతుంది. ఎందుచేతనంటే మీకు లోపల ఆ వాసన ఉంది. జున్ను దొరికేటప్పటికి ఆ సంస్కారం తినేయమని చెబుతుంది. అటువంటి తిండి తినటం వలన ఇంద్రియాలు అపవిత్రం అయిపోతాయి, మనస్సు అపవిత్రం అయిపోతుంది, శరీరం అపవిత్రం అయిపోతుంది. మరల అందులో నుండి బయటకు రావటం బహుకష్టం. అందుకే పరమాత్మ సంహరతే అన్నాడు. మనస్సు ఏ ఇంద్రియం ద్వారా బయటకు వెళ్ళిపోతోందో చూసుకోండి. అక్కడ నుంచి మనస్సును విత్‌డ్రా చేయండి. అక్కడ నుంచి మీ మనస్సును విత్‌డ్రా చేయరనుకోండి మానసికఆరోగ్యం చెడిపోతుంది, శారీరకఆరోగ్యం చెడిపోతుంది. ఆచార్యులవారు అన్నారు ఇసుకలో నూనెపోస్తే ఆ నూనెను మళ్ళీ వెనక్కి తీసుకోగలరా? అలాగే మీ ఇంద్రియాలతోటి

ఎన్ని భోగాలు అనుభవించినా ఇసుకలో పోసిన నూనెలాంటిది అన్నారు. మళ్లీ నువ్వు వాటిని తీసుకోలేవు. ఇవన్నీ జన్మాంతరంలో సంస్కారాలకింద మనస్సులో పడతాయి. ఒకసారి పని చేసామంటే అది అనుభవంలోనికి వచ్చేవరకూ ఆ కర్మ నిన్ను వెంటాడుతూ ఉంటుంది.

నీ శరీరాన్ని నువ్వు అనుకోవటం పెద్ద తప్పు. నువ్వు ఇంకో తప్పు చేస్తున్నావు ఇంట్లో వాళ్ళు అందరూ నువ్వు అనుకుని ఏడుస్తావు ఎందుకు అన్నారు ఆచార్యులవారు. అంటే మీ పిల్లలు మీరే, మీ మనవలు మీరే, మీ భర్త మీరే అందరూ మీరే ఇదేమి పద్ధతండి. మీ అబ్బాయికి జ్వరం వస్తే వైద్యం చేయించుకోండి అంతేకాని ఆ జ్వరం నీకు వచ్చేసినట్లు ఏడుస్తావేమిటి? వాడు నువ్వు ఎలాగ అవుతావు. నువ్వు పుట్టినప్పడు వాడు వచ్చాడా? నువ్వు చనిపోతే వాడు నీకూడా వస్తాడా? మీ అబ్బాయి చచ్చిపోయినప్పడు నువ్వు చచ్చిపోతావా? వాడే నువ్వు అనుకొని ఏడుస్తూ ఉంటే ఇంతకంటే పెద్ద మూర్ఖత్వం లేదు. దేహము నేను అనే తలంపుని పోగొట్టుకోవటం మానేసి అది నేను, ఇది నేను అని అనుకొంటూ దాని చుట్టూ తిరుగుతూ ఉంటే ఇంక అది ఎలా పోతుంది. నువ్వు సాధన చేసి దేహాత్మబుద్ధి వదిలించుకోవటం మానేసి దీనికి వచ్చే గొడవల్లోపడితే ఇది మహామాయ అన్నారు. మనం వెయ్యి కళ్ళతోటి చూసినా ఆ చీకటిని ఛేదించి వెలుగుని చూడలేము, అటువంటి కటికచీకటిలో మనం ఉన్నాము. అసలు మనకి విశ్లేషణ లేదు, వివేకం లేదు. ఈ అజ్ఞానంలోంచి నిన్ను మేలుకొలుపువాడు ఎవడూ లేడా? ఈ గాఢ అంధకారంలోంచి నిన్ను రక్షించేవాడు లేడా? మీ ఆయన మీకు బయట ఉన్నాడా లోపల ఉన్నాడా? బయటే ఉన్నాడు కదా బయట ఉన్న వాడిని బయటే ఉండనివ్వండి. గౌరవించండి వద్దనికాదు. మీ భర్తని లోపలవేసుకొని మొయ్యొద్దు. మీరు లోపల సత్యాన్వేషణలో ఉండండి. దేహప్రారబ్ధాన్నిబట్టి భర్తఅని, భార్యఅని, సంతానం అని, ఐశ్వర్యం అని, దారిద్ర్యం అని ఇవన్నీ వస్తూ ఉంటాయి. ఇవన్నీ ఎలాగ వచ్చాయో అలాగే వెళ్లిపోతాయి. ప్రారబ్ధం అనుభవించే టైము వచ్చినప్పడు నిన్ను మొట్టికాయలు మొట్టి నీచేత అనుభవింపచేస్తాడు. వాడు ఈశ్వరుడు.

నువ్వు జీవితం పొడుగునా సాధన చేసి, ప్రయత్నం చేసి రాగము, భయము, క్రోధము ఈ మూడింటిని విడిచిపెట్టు. రాగం అంటే కోరిక, రాగం అంటే మనకి మనుషుల మీద ఉన్న వ్యామోహం. మోహం చాలా ప్రమాదం. ఒక దుష్టుడిని మంచివాడని నమ్మి వాడి వెనకాల తిరుగుతున్నాము అనుకోండి వాడు మనకి చెడ్డ చేస్తే తప్పవాడిదికాదు. మనదే తప్ప ఎందుచేతనంటే వాడు దుష్టుడని గ్రహించలేకపోవటం వలన, మనకి వివేకం లేకపోవటం వలన మనం వాడి కూడా తిరుగుతున్నాము. మనం ఎక్కడ మోహపడకూడదో అక్కడే మోహపడతాము. వారే మనకి అశాంతిని తీసుకువస్తారు. అది అలా జరుగుతుందేమో, ఇది

ఇలా జరుగుతుందేమో అని ఊహించుకోవటం వల్ల భయం వస్తుంది. భయం వల్ల మీకు లోపల ఉన్న ఎనర్జీ తగ్గిపోతుంది. ఎక్కువ భయపడేవాడికి మరుపు వచ్చేస్తుంది. కోపం వచ్చిన వాడికి తొందరగా రోగం వచ్చేస్తుంది. రాగం, భయం, క్రోధం వీరే నిజమైన శత్రువులు. వీరు నీలోపలే ఉన్నారు. నీ అత్తగారు, నీ తోటికోడళ్ళు బయట ఉన్న శత్రువులు. వీరు నిన్నేమీ చేయలేరు. లోపలఉన్న శత్రువుల వలన నీకు ప్రమాదం. నువ్వు నారాయణ జపం చేసినా, రామజపం చేసినా, శంకరుడిని జపించినా నీ లోపల ఉన్న శత్రువులలోనుండి విడుదల పొందటమే నీ లక్ష్యం. జీవుడిని నువ్వే పవిత్రం చేసుకోవాలి. నిన్ను ఎవరో ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండకు. నిన్ను నువ్వు ఉద్ధరించుకొంటూ ఉంటే భగవంతుడి సహాయం, గురువు సహాయం నీకు వస్తుంది. నువ్వు సాధన విడిచిపెట్టకుండా ఉంటే, శ్రద్ధ విడిచిపెట్టకుండా ఉంటే, ఈశ్వరుడి మీద విశ్వాసం విడిచిపెట్టకుండా ఉంటే దేవుడు వచ్చి నీ శరీరాన్ని, నీ మనస్సుని ముట్టుకుంటాడు. అప్పడు ఈ కామాలు, ఈ క్రోధాలు, రాగద్వేషాలు అన్నీ ప్రవాహంలో గడ్డిపరక కొట్టుకుపోయినట్టు అన్నీ కొట్టుకుపోతాయి. గాడ్స్ టచ్ వచ్చేవరకూ మీరు ఓర్పుగా సాధన విడిచిపెట్టకూడదు. మీరు ప్రపంచం గొడవలలోనికి ఎక్కువ వెడితే మీ మనస్సు నెమ్మదిగా పాయిజన్ అయిపోతుంది. అందుచేత మీరు భగవంతుడు చెప్పిన మాటని ప్రమాణంగా పెట్టుకొని, జీవిస్తూ ఉంటే గాడ్స్‌టచ్ వస్తుంది. గాడ్స్‌టచ్ వచ్చిందా మీరు పరమపవిత్రులు అయిపోతారు. మీకు వెయ్యికోట్ల జన్మలు తీసుకొని వచ్చే వాసనలు, పాపాలు ఉన్నా అవన్నీ కాలిబూడిద అయిపోతాయి. మీరు ప్రయత్నం చేస్తూ ఉండాలి. ఎదురు చూచినట్టు ఉండకూడదు. ఓర్పు వదిలిపెట్టకూడదు. అది ఎప్పుడు వస్తుందో ముహూర్తం ఆయన పెట్టుకుంటాడు. భగవంతుడు ఆయన ఒడిలోకి మనల్ని తీసుకున్నాడంటే మన పని పూర్తయిపోయినట్లే.

జీవుడిని పరమపవిత్రం చేసే నామం రామనామం. శివుడు కాశీలో ప్రాణం పోయేవాళ్ళ చెవిలో రామమంత్రం ఉపదేశిస్తాడు. ఆ మంత్రం ఏమిటంటే "రాం రామాయనమః" దీనిని తారకమంత్రం అంటారు. అంటే జీవుడిని తరింపచేసే మంత్రం. వాల్మీకి చెప్తాడు ఆకాశంలో నక్షత్రాలని లెక్కపెట్టవచ్చు, ఇసుకగుట్టలో కూర్చొని ఇసుక రేణువులని లెక్కపెట్టవచ్చు కానీ రాముడి యొక్క సుగుణాలని లెక్కపెట్టలేము. రాముడిలో ఫలానా గుణం లేదని చెప్పలేము. తులసీదాసు అన్నాడు మీరు రామా అని కూడా అనక్కర్లేదు "రాం" అనండి సరిపోతుంది మీరు పవిత్రులు అయిపోతారు అన్నాడు. రాముడు పరిపాలన నిర్మలంగా ఉంటుంది, నిశ్చలంగా ఉంటుంది. రాముడు పరిపాలన చేసినా రాముడు చేత మనం పరిపాలించబడుతున్నాము అనే తలంపు

లేకుండా పరిపాలన చేస్తాడు వాడు రాముడు. ఇంద్రియచాపల్యంలో నుండి మనస్సు యొక్క చాపల్యంలో నుండి జీవుడిని బయటకి తీసుకువచ్చేది రామనామం. శివుడు అంటే జ్ఞానమని, అమ్మవారు అంటే శక్తి అని మనం అనుకుంటాము. జ్ఞానము, శక్తి కలిపిన దేవుడు రాముడు అని శివుడు చెప్పాడు. శ్రద్ధ లేకపోతే మనకి జ్ఞానం కలగదు. మన దగ్గర ఉన్న డబ్బువలన, మనకి ఉన్న చదువు వలన, మనకి ఉన్న గౌరవం వలన మనకి మోక్షం రాదు. పరమేశ్వరుడి పాదాల పట్ల మనకి ఉన్న భక్తివల్ల మటుకే ముక్తి సాధ్యం, భక్తిలేకుండా ముక్తి ఎవరికీ సాధ్యం కాదు. మన భక్తులకు కూడా భక్తి తక్కువే, మేము జ్ఞానులు అయిపోయాము అనుకుంటున్నారు. ఒక్కరికి దేహబుద్ధిపోలేదు, అంతర్దృష్టిలేదు. భగవాన్ అన్నారు అందరూ గజఈతగాళ్ళేకాని ఒక్కరు కూడా గజం కదలటంలేదు అన్నారు. మనకి భక్తిలేకపోయినా భక్తి ఉందని మనలను మనం వంచన చేసుకోవటం ఇది ఆత్మవంచన అని పరమాత్మ అన్నాడు. ఆత్మస్తుతి, పరనింద తప్పించి మనకి ఇంకోటి చేతకాదు. ఏసుక్రీస్తు అన్నాడు ఎదుటివారిలో ఉన్న మంచి చూస్తే మీరు బాగుపడతారు. ఎదుటి వారిలో ఉన్న చెడ్డ చూస్తే మీరు చెడిపోతారు. మిమ్మల్ని మీరు విమర్శ చేసుకొంటూ ఉంటే మీరు బాగుపడతారు అన్నాడు ఏసు. రాముడికి అన్ని శక్తులు ఉన్నాయి, అన్ని కళ్యాణగుణాలు ఉన్నాయి, ఆధ్యాత్మికశక్తి ఉంది, భౌతికశక్తి ఉంది. అన్ని శక్తులు ఉండి అణిగి ఉంటాడు. ఇది మనం రాముడిని చూచి నేర్చుకోవాలి. మనకి ఏమీలేదు కాబట్టి ఎగిరి, ఎగిరి పడతాము. నేను శాస్త్రాలు అన్నీ చదివినా, చదవకపోయినా నాకు రామనామం ఒక్కటే చాలు, మనం నదిని దాటాలంటే బోటు సహాయం ఉండాలి. అలాగే రామనామం సహాయంతో నేను శాంతిని, ఆనందాన్ని పొందుతున్నాను అని గాంధీగారు అన్నారు.

కృతయుగంలో, త్రేతాయుగంలో ఎక్కువ ధ్యానాలు, తపస్సులు చేసేవారు ద్వాపరయుగం వచ్చేటప్పటికి ఎక్కువ యజ్ఞాలు, యాగాలు, దేవతల్ని ఆరాధించేవారు. ఈ కలియుగంలో రామనామం సరిపోతుంది. ఇంకేమీ చేయనక్కరలేదు అని ఆంజనేయస్వామి అన్నాడు. కలిలో ఎంతదోషం ఉందో అంతమంచి కూడా ఉంది. మీరు యజ్ఞాలు, యాగాలు చెయ్యకపోయినా రామనామం శ్రద్ధగా చేస్తే మీరు తరిస్తారు అన్నాడు. రామనామం మీ బలహీనతల్ని ఎత్తి చూపుతుంది అంతేకాదు మీలో ఉన్న అపవిత్రతనంతా బయటకులాగి మంటపెట్టి దహనం చేస్తుంది. అంటే మీకు పునర్జన్మ హేతువులు ఏవి ఉన్నా రామనామం యొక్క అగ్ని దహించి విడిచిపెడుతుంది. అదీ రామనామం యొక్క వైభవం. రాముడిని నమ్ముకుని కోతులే తరించినవి, మరి మనం ఎందుకు తరించము. రాముడు రామాయణ కాలంలో వారిని రక్షించాడు, వీరిని రక్షించాడు అని చెప్పకుంటున్నారు. రాముడు ఇప్పుడు

శరీరంతోటి లేకపోయినా రామనామం స్మరించి కోట్లాదిమంది ఆత్మజ్ఞానం సంపాదించారు. రాముడి రూపంకంటే రాముడి నామం గొప్పది అని ఆంజనేయస్వామి చెప్పాడు. కొంతమంది వైష్ణవులకి రాముడి అంటే చాలా ఇష్టం. ఒక్కసారి రామనామం చేస్తే ఇంక రెండోసారి ఎందుకండి అంటారు. అదీ వారి నమ్మకం. రామాయణం చదివేటప్పుడు రాముడు దుఃఖపడిన ఆ ఘట్టాలు వదిలేయండి, ఎందుచేతనంటే పెరుమాళ్ళు దుఃఖం మేము భరించలేము అంటారు. వారు రామభక్తులు. మధ్వాచార్యులు అన్నారు భక్తి అనేది పెద్దపులి. పులి దగ్గరకి మేకలు, గొఱ్ఱెలు వస్తాయా! అలాగే భక్తి ఉన్న చోటికి విషయచింతన వస్తుందా? విషయచింతన వచ్చాక వదిలించుకోవటంకాదు భక్తి ఉన్న చోటకు అసలు విషయాలు రానేరావు. రాముడు మన హృదయంలో ఉన్నప్పుడు సెన్స్‌కాని ఇంక నాన్‌సెన్స్ ఉండదు. వాడు రాముడు.

యజ్ఞ, దాన, తపస్సులను మనం ప్రాణం పోయేవరకూ విడిచిపెట్టకూడదు. స్వార్థం లేకుండా పని చేయటం యజ్ఞం. గౌరవంకోసం మనిషి పని చేస్తూఉంటే వాడు నీచాతి నీచుడు. భగవంతుడి ప్రీతికోసం పనిచేస్తేవాడు ఉత్తమోత్తముడు అది యజ్ఞం. తపస్సు అంటే మనస్సుని ఎండింపచేయటం. ప్రారబ్ధాన్నిబట్టి మీకు గౌరవం వస్తుంది, అగౌరవం వస్తుంది ప్రారబ్ధాన్ని సహించ కలగటం తపస్సు. తపస్సు చేయటం వల్ల హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. మీకు ఏ వస్తువు అయితే బాగా ఇష్టమో దానిని తినటం మానేయాలి. ఆ వస్తువుని పూర్తిగా తినటం మానేయగల్గితే అది తపస్సు. అంటే మీ మనస్సులో ఉన్న ఇష్టాన్ని తపింపచేస్తున్నారు, ఎండబెడుతున్నారు. అన్నము మానేయటం తపస్సుకాదు. మీకు ఏ బలహీనత అయితే ఉందో ఆ బలహీనత పోవటం కోసం మనస్సుని ఎండబెడితే అదీ తపస్సు. నువ్వు ఏది కాదో అందులో నుండి విడుదలపొందటానికి నువ్వు చేసే ప్రయత్నం అంతా తపస్సు అని భగవాన్ అన్నారు. రామకృష్ణ పరమహంసగారు ఏమి అన్నారంటే మిమ్మల్ని రంపంపెట్టి కోసినా ఈ నేను అనే తలంపు పోదు. మీరు నూటికి నూరుపాళ్ళు భగవదనుభవంలో ఉన్నప్పడే నేను అనే తలంపు పోతుంది కాని అంత తేలికగా అది పోదు అది పోయినట్టు అనిపిస్తుంది అన్నాడు రామకృష్ణుడు. అహంకార రహితమైన, మమకార రహితమైన స్థితిలో ఏ సుఖాన్ని అయితే నువ్వు పొందావో, ఏ శాంతిని, ఏ ఆనందాన్ని నువ్వు పొందావో దానితోటి పోల్చదగిన ఆనందం ఈ లోకంలోకాని, పరలోకంలోగాని, వైకుంఠంలోకూడా లేదని నీకు తెలుస్తుంది. అది అనుభవైకవేద్యం అన్నాడు పరమాత్మ.

ఆత్మసుఖం నేను కొంత రుచి చూసాక సంసారులతోటి స్నేహం చెయ్యాలనిపించటం లేదు, వాళ్ళు కనిపిస్తే నాకు మాట్లాడాలని అనిపించటం లేదు అని వివేకానందుడు ఒకసారి రామకృష్ణుడు దగ్గర అంటాడు. అంత దూరం వెళ్ళిపోకు ఈ సంసారుల మధ్య నువ్వు కొంతపని చేయాలి. ఆ పని జరగనియ్యి. నాపని చేయటానికి నువ్వు వచ్చావు. నీకు సొంతపని లేదు అంటాడు రామకృష్ణుడు. రాముడికి ఆంజనేయస్వామి ఎటువంటివాడో రామకృష్ణుడికి స్వామీజీ అటువంటివాడు. అమెరికాలో స్వామీజీతోటి ఏమన్నారంటే మీ గురువులో ఏమీలేదు. మీ గురువుకంటే మీరే గొప్పవారు అన్నారు. మనం అయితే ఆ మాటలు భుజాన వేసుకొంటాము కాని స్వామీజీ ఆ మాటలను భుజాన వేసుకోలేదు. అప్పడు స్వామీజీ అంటాడు కలకత్తా కాలేజీలో చదువుతూ, ఆ రోడ్లమీద తిరిగేపిల్లవాడిని తీసుకొనివచ్చి, దేవుడు లేడని అనేకమందితో వాదించినటువంటి ఈ కుర్రవాడిని చేరదీసి ఓ సెయింట్‌కింద తయారుచేసాడు. అంత గొప్పవాడు నా గురువు రామకృష్ణుడు. నా గురువు అనుగ్రహం ఉంటే మీరు ఏ వివేకానందుడు చాలా గొప్పవాడు అనుకుంటున్నారో, అటువంటివారిని వెయ్యిమందిని ఆయన స్మరించి అప్పటికప్పడు తయారుచేయగలడు వాడు నా గురువు అని స్వామీజీ చెప్పాడు. ఈ మాయ అనే సాగరాన్ని దాటటానికి ఒక్క భక్తి చాలు. నిరంతరము భగవంతుడి పాదాలని పట్టుకొని ఉండటమే భక్తుడి లక్షణం. నువ్వు నిరంతరం గతాన్ని తలపెట్టుకొంటూ, భవిష్యత్ గురించి ఊహించుకొంటూ ఉంటే నీ భక్తి ఎలా నిలబడుతుంది అసలు నిలబడదు. ఈశ్వరుడి పాదాల యందు భక్తిచాలు మీరు ముక్తి పొందటానికి. భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రార్థించు, ప్రేమించు, భగవంతుడి కోసమే నువ్వు భక్తి చెల్లించు, అదీ ఆంజనేయస్వామి సందేశం. నీకు దేహాభిమానం ఉన్నంతకాలం రాముడికి నౌకరుని అనుకో, రాముడి పని చెయ్యి. మీ భర్తే మీకు యజమాని అనుకున్నప్పడు ఈ సృష్టికి కర్త అయినటువంటి రాముడు మీకు యజమానికాదా, మావారు చెప్పారు అని మీరు చేస్తున్నారు రైటే వద్దనటంలేదు. మరి అసలువాడు చెబితే వాడి మాటలు మీరు వినరా? వాడు మీకు ప్రభువుకాదా, ఏదో నాలుగు రూపాయిలు సంపాదించి మీకు సాపాటు పడేస్తున్నాడు వీడి మాటకే ఇంత విలువ ఇస్తూ ఉంటే అసలు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సృష్టికి ప్రభువు అయిన వాడి మాటను మీరు గౌరవించారా అని ఆంజనేయస్వామి అడుగుతున్నాడు. చాలామంది మాకు శనిపట్టుకుందని అంటారు. ఆ శని ఆంజనేయస్వామి దగ్గరకి మాత్రము వెళ్ళదు. వాడు అతిబలవాన్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-03-2009, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు మాఘపౌర్ణమి. లక్ష్మీదేవి క్షీరసముద్రంలో నుండి ఆవిర్భవించిన రోజు. లక్ష్మీదేవి అంటే కేవలం ఐశ్వర్యం అనేకాదు, గుణసంపదని ఇస్తుంది, మోక్షం ఇస్తుంది. మీరు పూర్వజన్మలలో కష్టపడితేనేకాని మంచిగుణాలు ఈ జన్మలో రావు. గుణాలు కూడా ఐశ్వర్యంతోటి సమానం. ఇప్పుడు మీరు అందరూ చించినాడ వచ్చారు. దారిలో ఎవరైనా కనపడితే మాట్లాడతారు కాని మీ గమ్యం ఏమిటి? చించినాడ రావటం. అలాగే మీరు మోక్షాన్ని గమ్యంగా పెట్టుకొని జీవించాలి అప్పడు మీలో చిన్న, చిన్న పొరపాట్లు ఏమైనా ఉంటే ఆ గమ్యం సరిచేస్తూ ఉంటుంది. మోక్షపరాయణుడికి అంటే మోక్షాన్ని గమ్యంగా పెట్టుకొన్నవాడికి పెద్ద సాధన లేకుండా వాడి గమ్యం మోక్షం కాబట్టి కోరిక, కోపము, భయము నెమ్మదిగా వదిలిపోతాయి అని చెప్పాడు. మీరు జీవితంలో మీ డ్యూటీ ఏదో మీరు చేసుకొంటూ గమ్యం మటుకు మోక్షాన్ని పెట్టుకోవాలి. మోక్షం తప్పించి ఇంకేది గమ్యంగా పెట్టుకున్నా ఫెయిల్ అయిపోతారు. ఆత్మజ్ఞాన సముపార్జన ఒకటే నిజం. ఆత్మజ్ఞాన సముపార్జన తప్పించి మనోదేహములను దేనికి ఉపయోగించినా ఒకటి లేని సున్నలే, మీ జీవితం అంతా వేస్టు అయిపోతుంది. మోక్షపరాయణుడికి ఇంద్రియనిగ్రహం వస్తుంది, మనస్సుకి శాంతి వస్తుంది, బుద్ధికి వివేకం పెరుగుతూ ఉంటుంది. ఏ దేహము ప్రారబ్దం లేకుండా పుట్టదు. ప్రారబ్దాన్ని బట్టి జీవితం ఎన్నో వంకరలు తిరుగుతూ ఉంటుంది. కొంతమంది మా ప్రారబ్దం ఎన్ని దెబ్బలు కొడుతోందో అంటారు. భగవంతుడికి మీమీద విరోధంకాదు. ప్రారబ్దం ఎందుకు దెబ్బలు కొడుతుంది అంటే లోపల ఉన్న సత్యం వైపుకి నీ ముఖాన్ని తిప్పటంకోసం, నీ మైండుని ప్రిపేర్ చేయటంకోసమే ఇది అంతా. మోక్షం పొందటానికి నీ మైండు ఫిట్ అవ్వాలి. నీ మైండుని ఫిట్ చేయటంకోసం అనేక దెబ్బలు కొట్టి కొట్టి మనస్సులో ఉన్న వంకరలు తీస్తాడు. వాడే ఈశ్వరుడు. నువ్వు మనోదేహములతోటి తాదాత్మ్యం పొందటంవల్ల నీకు ఈ దెబ్బలు తగులుతున్నాయి నువ్వు బ్రహ్మముతోటి తాదాత్మ్యం పొందితే నీకు ఎన్ని దెబ్బలు తగిలినా దెబ్బలు తగలనట్టే అనిపిస్తుంది.

నీ ముఖం దేహంవైపుకి, మనస్సువైపుకి తిప్పకు నీ ముఖం బ్రహ్మము వైపుకి తిప్ప. ప్రారబ్దం అనేది స్వప్నం. పుట్టిన దానికి ప్రారబ్దం ఉంటుంది కాని పుట్టని దానికి ప్రారబ్దం ఉండదు. పుట్టినదానికి వికారాలు ఉంటాయి, పుట్టని దానికి వికారాలు ఉండవు. దేహంతో,

మనస్సుతో నువ్వు తాదాత్మ్యం పొందినా అది నువ్వు కాదు. ఏది అయితే నువ్వో దానితోటి తాదాత్మ్యం పొందితే అందులో నువ్వు స్థిరపడతావు. అప్పుడు నీకు జన్మలు ఆగిపోతాయి. నువ్వు కళ్ళతోటి చూచిన విషయాలు, చెవులతోటి విన్న విషయాలు, ఈ భోగాలు అన్నీ మీకు కాకిరెట్టతో సమానంగా కనిపిస్తేనే మీ మనస్సు లోపలికి వెడుతుంది లేకపోతే వెళ్ళదు అన్నారు ఆచార్యులవారు. భోగాలని నువ్వు కాకిరెట్టతోటి సమానంగా చూడాలి. అవి కాకి రెట్టలాగ నీకు కనపడాలి, నువ్వు అలా దర్శించాలి, అలా దర్శిస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది లేకపోతే సున్న. వైరాగ్యాన్ని పెంచుకుంటూ రావాలి. మీకు ఎప్పుడైనా కోపం వచ్చినప్పుడు వైరాగ్యం వస్తుంది అది నిలబడదు. ఇది సత్యమా, అసత్యమా, ఇది ఉపయోగపడుతుందా, ఉపయోగపడదా, ఇది నిత్యమా అనిత్యమా అని ఆ వివేకం వల్ల మీకు వైరాగ్యం రావాలి కాని కోపం వచ్చి, చిరాకు వచ్చి వైరాగ్యం వస్తే అది నిలబడదు. మీరు ఏ మతస్థులు అయినా, ఏ కులస్థులు అయినా అంతఃకరణశుద్ధి లేకుండా ఆత్మజ్ఞానం రాదు. క్రమశిక్షణ లేకుండా నీకు ఏమీ సాధ్యంకాదు. నువ్వు కోరిక లేకుండా పనిచెయ్యి. నీ దేహయాత్రకి సరిపడి నువ్వు పనులు చూసుకొంటూ ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నించు. రాగద్వేషాలు తగ్గించుకో, ఏకాంతవాసం నేర్చుకో, సహవాసం కంటే ఏకాంతవాసం మంచిది. ఆహారంలో జాగ్రత్తగా ఉండాలి. నీకు ఆహారశుద్ధి లేకపోతే నువ్వు ప్రయత్నం చేసినా నీకు చిత్తశుద్ధి రాదు. చిత్తశు ద్ధికి ఆహారశుద్ధి చాలా ముఖ్యం. చిత్తశుద్ధి ఎలా కలుగుతుంది అంటే, నువ్వు ఆసక్తి లేకుండా పని చేస్తూఉంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. కానీ ఏ పనీ పాట లేకుండా ఊరికే సోమరితనంగా కూర్చుంటే చిత్తశుద్ధి వచ్చేయదు.

చాలామంది వారి పనులు వారు చేసుకుంటూ ఏదో కర్మయోగం చేస్తున్నాము అంటారు అదొక మాయ. పని చేసేవారు అందరూ కర్మయోగులు కాదు. నిష్కామంగా, ఆసక్తి లేకుండా, ఫలకాంక్ష లేకుండా ఎవడైతే పని చేస్తున్నాడో వాడు కర్మయోగి. మేము చాలా కష్టపడి పనిచేసుకుంటున్నాము అంటున్నారు. ఎవరికోసం చేస్తున్నారు, కష్టపడి ఆస్తి ఎందుకు పెంచుకుంటాడు అంటేవాడి అహంకారం సంతృప్తి అవ్వటానికి ఇది అంతా చేస్తాడు. కొంతమంది ఇంట్లో వాళ్ళు ఇంక సంపాదించవద్దు సరిపోతుంది అని చెప్పినావాడు మానడు. ఎందుచేతనంటే అందరూ మీరు చాలా ధనవంతులు అంటే వాడి దేహభావన సంతృప్తి పడుతుంది, అది వాడికి ప్లెజర్ ఇస్తూ ఉంటుంది. ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా భోగాలు రోగాలకింద, సంపదలు ఆపదలు కింద మారకుండా ఆగవు

అన్నాడు గీతలో. దానిని ఎవడూ ఆపుచేయలేడు. నువ్వు అనుభవించే ప్రతీభోగం కూడా రోగం కింద మారిపోతుంది. లౌకికమైన ఏ ప్రయోజనం కోరి నేను మాట్లాడినా అంతఃకరణ శుద్ధిరాదు. మీరు అందరూ నన్ను గౌరవిస్తారని మాట్లాడితే నాకు అంతఃకరణ శుద్ధిరాదు. భగవంతుడు గీతలో ఏమని చెప్పాడో అది ఏదో కొంతవరకు నేను అర్థం చేసుకొని, జీర్ణం చేసుకొని మీకు అర్థమయ్యేలాగ చెబితే ఈ మాటకి ఉపకారం కాని లేకపోతే ఈ మాటవల్ల మీకు ఏమీ ఉపకారం రాదు. నా పిచ్చ అంతా చెబితే మీకు ఉపయోగపడదు. అంతఃకరణ శుద్ధిలేకపోతే మనం ఎన్ని సాధనలు చేసినా మనకి ఆత్మజ్ఞానం కలుగదు. మనం చేసే కర్మల వలన, మనం మాట్లాడే మాటల వలన మనకి అంతఃకరణశుద్ధి కలగాలి. అంతఃకరణ శుద్ధి కలగకపోతే ఇవన్నీ ఒకటిలేని సున్నలే, వాటి వలన ఏమీ ప్రయోజనం లేదు.

కోరికతోటి చేసేపనివల్ల అంతఃకరణ శుద్ధి కలగదు. నీకు అంతఃకరణ శుద్ధి కలగటంకోసం కొన్ని యజ్ఞాలు మనం ఆచరించాలి. దేవతల్ని పూజించటం, ఎప్పుడైనా గుడికి వెళ్ళి దేవుడిని దర్శించుకోవటం, నీ ఇష్టదైవాన్ని పూజ చేసుకోవటం, రాముడి గుణాల్ని స్తోత్రం చేయటం, ఆయన రూపాన్ని ధ్యానించటం, ఆయన నామాన్ని స్మరించటం ఇదంతా దేవయజ్ఞం. రోజూ ఒక గంట భగవద్గీత చదవటం. వాల్మీకిమహర్షి, వ్యాసమహర్షి, రమణమహర్షి, రామకృష్ణమహర్షివంటి మహాత్ములు వారు అనుభవించి కొన్ని మాటలు చెప్పారు. అవి మనం చదువుతూ ఉంటే వారి ఋణం తీరుతుంది. రాగద్వేషాలతోటి రాసిన రచనలు అసలు చదవకూడదు, రాగద్వేషాలతోటి కూడిన మాటలు ఎవరైనా చెబుతూ ఉంటే అవి వినకూడదు. ఋషి వాక్యాలు, మహాత్ములు చెప్పిన మాటలని మీరు అధ్యయనం చేస్తూ ఉండాలి. అధ్యయనం చేస్తూ ఉంటే మీకు ఋషిఋణం తీరిపోతుంది ఇది ఋషియజ్ఞం. పితృయజ్ఞం అంటే మన ఇంట్లో ఉన్న పెద్దలని గౌరవించటం. మీ ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళు మంచివాళ్ళు అవ్వచ్చు, చెడ్డవాళ్ళు అవ్వచ్చు అది మీకు అనవసరం, ఆ ఇంట్లో ఉన్నారు కాబట్టి మీ డ్యూటీ మీరు చెయ్యండి. మీ నాన్నగారు మంచివారు కాకపోతే అది దేవుడు చూచుకుంటాడు. నీ శరీరానికి జన్మనిచ్చాడు కాబట్టి చూడు అంతే. అలాగని వారిని నెత్తిమీద పెట్టుకొని తిరగనక్కరలేదు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే వారి జ్ఞాపకార్థం శ్రార్ధకర్మలు చెయ్యండి. ఇక్కడ మీరు అన్నం ముద్దలు పెడతారు కదా, మీ పూర్వీకుడు అప్పటికి జంతుజన్మలోకి వెళ్ళిపోయాడు అనుకోండి భగవంతుడు మీ అన్నాన్ని పచ్చగడ్డికింద మార్చి వాడికి పెడతాడు. మొత్తంమీద ఏదోరకంగా మీరు పెట్టినది అందుతుంది. ఇది పితృయజ్ఞం. మీ కుటుంబ అవసరానికి సరిపోగా మిగిలిన డబ్బు ఇతరులకు

ఉపయోగించమన్నారు అది మనుష్యయజ్ఞం. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. డబ్బు ఎలా సద్వినియోగం చెయ్యాలో ముందు తెలుసుకొని తరువాత డబ్బు సంపాదించు అన్నారు. ప్రపంచంలో మనుష్యయజ్ఞం చేసేవాడు బఫెట్. అతను అమెరికా వాడు. ప్రపంచంలో రెండవ ధనవంతుడు. రూపాయి సంపాదిస్తే ఒక పావలా కుటుంబానికి ఇచ్చేవాడు. అంతకంటే ఎక్కువ ఇస్తే వాళ్ళు పాడైపోతారని చెబుతాడు. మిగిలిన ముప్పావలా ఆయన తెరమీదకి రాకుండా గొప్ప దాన ధర్మాలు చేసేవాడు. దానధర్మాలు చేస్తున్నాడని ఎవరు చెప్పకోవటం ఆయనకి ఇష్టం ఉండదు. అతను మీ ప్రక్కనే కూర్చుంటాడు కాని ప్రపంచంలో ఆయన ధనవంతుడు అని మనకి తెలియదు. అంటే డబ్బువాడి చేతిలో ఉంటుంది కాని డబ్బు వాడి నెత్తిమీద ఉండదు. వాడు కర్మయోగి.

భూతయజ్ఞం అంటే పశువుల్ని మీరు ప్రేమగా చూచుకోవాలి. వాటికి టైముకి నీళ్ళు పెట్టాలి, టైముకి తెలగపిండి పెట్టాలి, పచ్చగడ్డి వేయాలి. మీమీద ఆధారపడిన జంతువులను కూడా మీరు ప్రేమగా చూడాలి ఇది భూతయజ్ఞం. ఇన్ని రకాల యజ్ఞాలు చేసుకుంటూ వస్తే మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. సాధన చేసేవాడికి బద్ధకం పనికిరాదు. ఎప్పుడు మీకు ఇంట్రెస్టు కలిగితే అప్పడే సాధన ప్రారంభించండి. సాధకుడికి ఎంతోకొంత పట్టుదల ఉండాలి, పట్టుదల లేకపోతే ఏదీ సాధ్యం కాదు. మీ ఇష్టదైవాన్ని తీసుకొని ఆ రూపాన్ని ధ్యానం చేసుకోవటం, ఆ నామాన్ని స్మరించుకోవటం వల్ల మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది. జపం చిత్తశుద్ధికి దారితీస్తుంది. తుకారామ్, తులసీదాసు, మీరాభాయ్ వీరు అందరూ నామస్మరణ చేసి తరించారు. మోకాలు లోతులోంచి నడచివెళ్ళటం మనకి ఎంత తేలికో, భగవంతుడు పట్ల విశ్వాసం ఉన్నవాడు సంసారాన్ని దాటటం కూడా అంతే తేలిక. కాళ్ళు నడుస్తూ ఉంటాయి, చేతులు పనిచేస్తూ ఉంటాయి కానీ మన మనస్సు ఎప్పడూ జపం మీద ఉండాలి. మన శరీరం ఎక్కడ ఉంది అన్నది ముఖ్యంకాదు. మన మనస్సు ఎక్కడ ఉంది అన్నది ముఖ్యం. ఆ నామం యొక్క రుచి మీకు తెలియాలి. ఆ నామం యొక్క రుచి మీకు తెలిసింది అనుకోండి అప్పడు లోకానికి సంబంధించిన రుచులు అన్నీ తగ్గిపోతాయి. అందుచేత నామమే దేవుడు. రూపం కంటే కూడా నామమే గొప్పది. గురువు మనకి కనిపించే దేవుడు. కనిపించని దేవుడుని కనిపించే దేవుడు చూపిస్తాడు వాడే గురువు. గురువు చేసే పని అది. ఆ పని చెయ్యకుండా ఇంకో పనిలోనికి గురువు వెడితే వాడు గురువుకాదు రాక్షసుడు.

నువ్వు జపం చెయ్యగా, చెయ్యగా భగవంతుడు దగ్గరకి వెళ్ళే మార్గం నీకు ఓపెన్ అవుతుంది. దుర్మార్గంలో ఉన్న మనిషి సన్మార్గంలోకి రావటం చాలా కష్టం. అది మనం అనుకున్నంత తేలికకాదు. దానికి ఎంతో సాధన చెయ్యాలి, వెనకాల ఎంతో పుణ్యబలం ఉండాలి. నీకు భౌతికంగా ఎంత నష్టం వచ్చినా దుష్టసహవాసం చెయ్యవద్దు, నీకు దుష్టసహవాసం చెయ్యవలసిన అగత్యమే వస్తే వెళ్ళి నీ తలకాయ పులినోట్లో పెట్టు అని మధ్వాచార్యులవారు అన్నారు. అంటే దుష్ట సహవాసం చేసే బదులు నీ ప్రాణం పోగొట్టుకోవటం మంచిది అనిచెప్పటం. దుష్ట సహవాసం వల్ల చాలామంది పాడైపోతారు. దుష్టసహవాసం చెయ్యటం వలన మనకే నష్టం కాని వాడికి నష్టం ఏముంది. అందుచేత నువ్వు జపం, ధ్యానం విడిచిపెట్టకు, సజ్జన సాంగత్యం విడిచిపెట్టకు. నువ్వు సాధన చేస్తూ ఉంటే ఎప్పుడోకప్పుడు దుర్మార్గంలో నుండి సన్మార్గంలోనికి వస్తావు. సన్మార్గంలోనికి వచ్చిన వాడికి ఆ సద్వస్తువు ఎరుకపడుతుంది. భగవంతుడిని మనం తెలుసుకోలేము. ఆయన తెలియబడితే మనం తెలుసుకోవటానికి పనికి వస్తాము. నువ్వు సన్మార్గంలో ఉంటే నీ ప్రవర్తన చూచి సద్వస్తువు తనంతట తానుగా నీకు ఎరుకలోనికి వస్తుంది. అదే ఆత్మసాక్షాత్కారం.

మనం అవసరం లేకుండా ఏదో మాట మాట్లాడుతూ ఉంటాము అనుకోండి దానివలన జగడాలు ఎక్కువ వస్తాయి. క్రమశిక్షణ ముఖ్యం. క్రమశిక్షణ ఉంటే మీకు అన్నీ వచ్చేస్తాయి. రెగ్యులారిటీని సాధకుడు విడిచిపెట్టకూడదు. రెగ్యులారిటీ అంటే టైముకి లేవటం, ఆ టైముకి జపం చెసుకోవటం, టైముకి ధ్యానం చేసుకోవటం అన్నీ కూడా కరెక్టుగా టైముకు చేస్తూ ఉండాలి. ఆహారంలో, నిద్రలో, వ్యవహారంలో రెగ్యులారిటీ ఉండాలి. దానివలన కూడా నీకు అంతఃకరణశుద్ధి కలుగుతుంది. ఏసు అంటాడు ఒక మనిషి ఒకేసారి ఇద్దరి దగ్గర పాలేరుతనం చేయగలడా, చేయలేడు అలాగే భక్తుడు అనేవాడు ధనానికి, జ్ఞానానికి ఒకేసారి చాకిరీ చేయలేడు. నువ్వు జ్ఞానానికి బానిసగా అయినా ఉండాలి లేకపోతే ధనానికి బానిసగా అయినా ఉండాలి. కాని రెండింటికి బానిసగా ఉండటం కుదరదు. ఈ గొడవ వదిలిపోయిందంటే మళ్ళీ ఆ గొడవ వచ్చి పడింది. మాకు శాంతిలేదు అని సంసారపక్షంగా అనుకుంటూ ఉంటారు కదా! ఒక రహస్యం మీరు కడుపులో పెట్టుకోండి. అసలు మన మనస్సులో శాంతిలేదు. మీ మనస్సులో శాంతి ఉందనుకోండి బాహ్యవిషయాలు ఏమీ మిమ్మల్ని భంగపరచలేవు. బాహ్యవస్తువుల మీద, బాహ్యపదార్థాలమీద ఆధారపడి మీరు ఎంతకాలం శాంతిగా ఉంటారు. ఊడిపోయే ముక్కు ఎంతకాలం పట్టుకుంటారు. మీకు లోపల సహజంగా శాంతి ఉంది. లోకంలో ఉన్న దుఃఖం అంతా చుట్టబెట్టేసుకొని వచ్చి

వాడి మీద పడినా ఎవడి మనస్సు అయితే చలించదో, వాడు బ్రహ్మజ్ఞాని. నువ్వు ఇతరుల మీద ఆధారపడుతున్నావు అనుకో నీ స్వతంత్ర్యం పోయినట్లే. స్వాతంత్ర్యం లేనివాడికి జ్ఞానమా? స్వాతంత్ర్యం లేనివాడికి సుఖమా? స్వాతంత్ర్యం లేనివాడికి పునర్జన్మలేనిస్థితా అని పరమాత్మ గీతలో చెప్పాడు. అరవింద ఘోష్ చెప్పారు ఒక మనిషి యొక్క ప్రాముఖ్యత, ఒక మనిషి యొక్క ఔన్నత్యం బాహ్యజీవితాన్ని బట్టి ఎప్పడూ కొలవవద్దు అన్నారు. కొంతమంది బాహ్యానికి చాలామంచిగా ఉంటారు. లోపల అన్నీ మురికి గుంటలే. కొంతమంది వారు మంచివారు కాకపోయినా మంచివారికింద నటిస్తారు. నటించటం వేరు, రియల్గా ఉండటం వేరు. నువ్వు జపం చేస్తూ ఉంటే నువ్వు చేసే నామం నీ మనస్సులో, నీ ప్రాణంలో ఐక్యమైపోవాలి. అప్పడు జపం వల్ల వచ్చే ఫలితం నీకు తెలుస్తుంది. జపం వల్ల నీకు ఏకాగ్రత వస్తుంది, మనస్సుకి నెమ్మదిస్థితి వస్తుంది, జపం వల్ల నీకు ఉపయోగం లేని తలంపులు, ఆలోచనలు రావటం తగ్గిపోతాయి. జపం మనస్సుతోటి ఏకమైతే అప్పడు రెండో తలంపుకి అవకాశం ఉండదు. అనన్యచింతన వస్తుంది.

మీకు ఏదైనా చెడ్డ సంఘటన జరిగితే కంగారుపడకండి. ఆ సంఘటన పరిణామంలో మంచికోసమే జరగవచ్చు. మీరు అర్థం చేసుకుంటే ఒకోసారి మీ దుఃఖము అంతా సంతోషముగా మారిపోతుంది. ఎట్టి పరిస్థితులలో నువ్వు వర్రీ పడకు. ఆకాశం వచ్చి నీ మీద పడుతున్నా నువ్వు వర్రీ పడవద్దు. నువ్వు వర్రీ పడితే అది ఆగుతుందా? ఆగదు. ఆ వర్రీ యొక్క వేగం కూడా నీలో ఎంటర్ అవ్వకుండా జపం నీకు సహకరిస్తుంది. జపం అంటే తక్కువ అంచనా వేయకండి. రైలు పెట్టెను ఇంజనుకు తగిలిస్తే ఆ ఇంజను కూడా పెట్టి ఎలాగ వెళ్ళిపోతుందో అలాగే మనస్సుని జపంతోటి ఈశ్వరుడికి అనుసంధానం చేసి పరమపవిత్రులు అయి పరమపదాన్ని పొందినవారు ఉన్నారు. కృష్ణుడు గీతలో జపయజ్ఞాన్ని నేను అన్నాడు. జపం ఎవరికీ ఎందుకు ఇష్టం ఉండదు అంటే, అది ఖర్చులేని పని మీరు ఎలా కూర్చుంటే అలా జపం చేసుకోవచ్చు అందుచేత జపయజ్ఞం అంటే మీ అందరికీ తేలికగా ఉంటుంది. కొంతమందికి ప్రతీ రోమం కూడా జపం చేస్తూ ఉంటుంది. నామం అంత ప్రాక్టీసు చేస్తారు. వాళ్ళకి ఇంక చెడ్డతలంపులు రావు, వారికి లోకవాసన పోతుంది. జపం మీకు మానసిక ఆరోగ్యం, శారీరకఆరోగ్యం తీసుకువస్తుంది. నీ వాసనని బట్టి జన్మ వచ్చేస్తుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. అయితే ఆ వాసనని మనం సాధన చేసి ఎంతవరకూ కాల్చి బూడిద చేయగలుగుతున్నాము అనేది మన సాధనా బలం మీద ఆధారపడి ఉంటుంది. మన బుద్ధి సూక్ష్మతమీద, ఈశ్వరునిదయమీద ఆధారపడి ఉంటుంది. నేను చెప్పేది ఈ

ఒక్క వాక్యం మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మీరు ఎలా తిప్పలు పడతారో, ఏరకంగా సంపాదిస్తారో మీరు మాత్రం అందరూ ఈశ్వరుని దయను సంపాదించండి. ఈశ్వరుని దయ వస్తే అన్నీ వచ్చినట్టే. ఈశ్వరుని దయ లేనపుడు మీకు ఎన్ని ఉన్నా ఒకటిలేని సున్నలే. ఈశ్వరుని దయ సంపాదిస్తే మనం అందరం ధన్యులం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-07-2009, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గురుపూర్ణిమ. మనకు సంక్రాంతి, దీపావళి ఇలా కొన్ని స్పెషల్ డేస్ ఉన్నాయి, అలాగే గురుపూర్ణిమ భక్తులకు స్పెషల్‌డే. వ్యాసుడు జన్మించిన ఈ ఆషాడ పూర్ణిమను గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటుచేసారు. భక్తులందరూ ఎవరిగురువును వారు ఆరాధించుకొనే రోజుగా ఈ గురుపూర్ణిమను ఏర్పాటుచేసారు. వ్యాసుడు మహాభారతం రచించాడు. ఆయన వేదాలను విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. వేదంలో భక్తి గురించి, దేవుడి గురించి, జ్ఞానం గురించి చెప్పాడు మనకు సంబంధం లేదు అని చాలామంది అనుకొంటారు కాని వేదంలో అన్ని విషయాల గురించి చాలా వివరంగా చెప్పారు, వేదంలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం ఏదీ లేదు. మన బిహేవియర్ ఎలా ఉండాలి, మనలను మనం ఎలా ఉద్దరించుకోవాలి, కేవలం ఆర్థికమైన, సామాజికమైన అభివృద్ధిపొంది ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందకపోతే మనకు జీవితంలో ఎంత వెలితి ఉంటుందో, మనం ఎలా పతనమవుతామో ఇవి అన్నీ వేదంలో చెప్పారు. కొంతమంది ఆర్థికంగా చాలా బాగుంటారు, సమాజంలో గౌరవంగా బతుకుతారు. కాని లోపల అశాంతి ఉంటుంది, జీవితంలో ఏదో కొరత ఉందని అనిపిస్తుంది. ఆధ్యాత్మిక అభివృద్ధి లేకుండా మనిషి పూర్ణమానవుడు అవ్వలేడు. బయట మీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా మనో నిగ్రహం లేకపోతే మీరు సుఖపడరు అని వేదంలో చెప్పాడు. వేదాలను చదివి అర్థం చేసుకోవటం కష్టం. అందుచేత వేదాలసారాన్ని అంతా మహాభారతంలో చెప్పాడు. ఈ సృష్టిలో ఎన్ని రకాల మనస్థత్వాలు ఉన్నాయో, వారి బిహేవియర్ ఎలా ఉంటుందో ఒకో కేరెక్టర్ ద్వారా వ్యాసుడు భారతంలో వివరంగా చెప్పాడు.

వ్యాసుడు బ్రహ్మసూత్రాలు రచించాడు. సూత్రం అంటే ఏమిటి అంటే విశాలమైన అర్థాన్ని ఒక చిన్న వాక్యంలోనికి తీసుకుని వచ్చి, ఆ సూత్రాన్ని వ్రాస్తాడు. మనకు భారతం అర్థమైనట్లు, రామాయణం అర్థమైనట్లు ఆ సూత్రాలు అర్థంకావు. బ్రహ్మసూత్రాలు అంటే బ్రహ్మజ్ఞానం గురించి

చెప్పినవి. అవి భారతంలాగ చదువుకొనేవి కాదు. గురువుచేత చెప్పించుకోవాలి. గురుశిష్య సంబంధంకింద గురువు పాదాలను ఆశ్రయించి, ఆయన దగ్గర ఉండి వాటిని మనం నేర్చుకోవాలి కాని ఏవో మీటింగులలో చెప్పకొనేవి కావు. మనం గురుపూర్ణిమ రోజున ఒక్క వ్యాసుడినేకాదు వసిష్ఠుడు, రమణుడు, రామకృష్ణుడు ఇంకా ఇలా చాలామంది గురువులు ఉన్నారు, వారందరిని మనం స్మరించుకోవాలి. మనం రోజూ గురువుని స్మరించుకోలేకపోయినా కనీసం గురుపూర్ణిమ రోజున అయినా గురువును స్మరించుకోవాలి. అందుచేత భక్తులందరికీ ఇది స్పెషల్‌డే. మీకు ఒకో గురువు ఉండవచ్చు. గురుపూర్ణిమ రోజున పూర్వపు గురువులను స్మరించుకొంటూ, వారికి నమస్కరించి, ప్రస్తుతం మనకు ఏ గురువుతో అయితే ఎటాచ్‌మెంట్ ఉందో ఆ గురువును కూడా స్మరించుకొంటూ గడపాలి. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే ఒకో గురువుకి కొంతమంది భక్తులను కేటాయిస్తాడు. వీరి మొఖం కొత్తగా ఉంది, వీరు ఎవరు, వారు ఎవరు అంటూ ఆశ్రమంలో ఉన్నవారు భగవాన్‌తో అంటే వారు ఎవరు, వీరు ఎవరు అని అడుగుతున్నావు, ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు, మనవారు కాబట్టే మన దగ్గరకు వచ్చారు. అసలు జన్మాంతరంలో వారికి మనకు ఏదో సంబంధం ఉంది. అందుచేత వారు ఇక్కడకు వచ్చారు లేకపోతే వారు మన దగ్గరకు ఎందుకు వస్తారు. మన మానసికస్థితిని బట్టి ఒక గురువుతో మనకు ఎటాచ్‌మెంట్ ఉంటుంది. గురువుతో బాగా ఎటాచ్‌మెంట్ పెరిగేకొలదీ ఈ ప్రపంచానికి సంబంధించిన ఎటాచ్‌మెంట్స్ తగ్గిపోతాయి. ఆయన మీద విశ్వాసం కలిగేలాగ ఆయనే చేసుకొంటాడు, ఆత్మజ్ఞానం సముపార్జించాలి అనే ప్రేరణ కలుగచేస్తాడు, వాడు గురువు.

నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. నీ లోపల ఉన్న భగవంతుడే నీకు బోధచేయటం కోసం శరీరం ధరించివస్తాడు, వాడు గురువు. బ్రహ్మం ఉంది అని చెపుతున్నారు. ఆ ఉంది ఉంది అనుకొనేది ఉందో లేదో అని అనుమానాలు వస్తాయి. బుద్ధుడులాంటి మహాగురువును చూస్తూ ఉంటే మనకు తెలియనిది ఏదో ఉంది అని ఆయన కళ్ళ ద్వారా మనకు తెలుస్తుంది, అప్పుడు దానిని గురువు మనకు అనుభవంలోనికి తీసుకొని వస్తాడు. అంతేగాని ఏదో బుడబుక్కల మాటలు చెప్పటం కాదు. గురువు నీ లోపల ఉన్నాడు, బయట ఉన్నాడు. బయట గురువు ఏమి చేస్తాడు అంటే నీ కూడా తిరుగుతూ ఉంటాడు. నీ సమస్యలు అన్నీ వాడి సమస్యలు అనుకొంటాడు. సత్యపదార్థం యొక్క విలువను నీకు చెపుతూ ఉంటాడు. నీతో మంచి మాటలు చెపుతూ ఏ బలహీనత వలన నీ మనస్సు బాహ్యముఖమవుతుందో చూసుకొని ఆ బలహీనతలను తొలగిస్తాడు, వాడు గురువు. బయట జీవితం అంతా బాగానే ఉంది కాని లోపల ఏదో అశాంతిగా ఉంది ఏమిటి అని మీకు అనిపిస్తుంది. లోపల ఉన్న

అడవి మీకు తెలుస్తోంది అంటే అది మీ తెలివితేటల వలన కాదు, గురువు లోపల కెలుకుతున్నాడు. నీ లోపల ఉన్న బలహీనతలను కెలికి, వాటి గురించి నీకు తెలిసేలాగ చేసి వాటిని తొలగిస్తాడు, వాడు గురువు. మీరు బాగుపడండి అని కూడా గురువు చెప్పడు, లోపల చేయవలసిన సర్జరీ అంతా సైలెంట్‌గా చేసుకొనిపోతాడు, అదీ ఆశ్చర్యం. బుద్ధిసూక్ష్మత ఉంటే గాని ఆయన చేసే పని మనకు తెలియదు. మీలో ఏ బలహీనతలు ఉన్నాయో అవి మీకు తెలిసే సంఘటనలను ఆయన క్రియేట్ చేస్తాడు. మీరు ఎలాగ ఉన్నారు, హేపీగా ఉన్నారా అని అంటే మేము హేపీగా ఉన్నాము అని చాలామంది చెపుతారు, అవి అన్నీ అబద్దాలు. ఎందుచేతనంటే మేము హేపీగా లేము అంటారు అనుకోండి ఎందుకు హేపీగాలేరు అంటే చెప్పలేరు. మనది ఓపెన్‌మైండ్‌కాదు. గురువుకు ప్రాక్టికాలిటీ ఎక్కువ ఉంటుంది. వాడు ఏదిగా ఉన్నాడో అది మీచేత పొందింపచేయటానికి చూస్తాడు. ఉన్నదంతా నీలోపలే ఉంది, బయట ఏమీలేదు. కొన్ని కొన్ని బలహీనతలు చాలా లోతుగా ఉంటాయి, అవి టీచింగ్‌వలన పోవు. అప్పడు ఒకో సంఘటనను క్రియేట్ చేసి మిమ్మల్ని తలుపు సందున పెట్టి నొక్కినట్లుగా నొక్కుతాడు, అప్పడుగాని మీలోపల ఉన్న పసరు అంతా బయటకు రాదు. అలా మీలో ఉన్న బలహీనతలను బయటకు కక్కించి, మిమ్మల్ని పరిశుద్ధంగా చేస్తాడు. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. బయట గురువు ఏమి చేస్తాడు అంటే ఏ ఆకర్షణలకు మనం గురి అవుతున్నామో చూసి, వాటిలో నుండి మనలను తప్పించి, మన జుట్టును లోపల గురువుకు అందిస్తాడు. అంటే బయట గురువు నిన్ను లోపలకు గెంటుతాడు, అప్పడు లోపల గురువు ఏమి చేస్తాడు అంటే నువ్వు ఏదిగా ఉన్నావో అక్కడకు నిన్ను గుంజుకొని పోతాడు, అంటే మిగిలిన పని అంతా లోపల ఉన్న గురువు చేసేస్తాడు.

ఓ అరుణాచలేశ్వరుడా! నేను తల్లి ప్రేమ చూసాను, తండ్రి ప్రేమ చూసాను, స్నేహితుల ప్రేమ చూసాను కాని నీ ప్రేమతోటి సమానమైన ప్రేమ భౌతికంగా నాకు ఎక్కడా కనబడలేదు. అంటే ఈశ్వరప్రేమలో పొల్యూషన్ ఉండదు. హ్యూమన్ లవ్‌లో పొల్యూషన్ ఉంటుంది. హ్యూమన్ లవ్‌కు ఏదో కారణాలు ఉండాలి. డివైన్‌లవ్‌కు కారణాలు అక్కరలేదు. కారణభక్తి ఎప్పడు నిలబడదు, అకారణభక్తి మాత్రమే నిలబడుతుంది. అందుచేత ఈశ్వరుడిమీద మనకు భక్తి ఉండాలి, కారణం కనబడకూడదు. కొంతమంది వారి గురించి వారు పని చేసుకొంటారు, వారి గురించే వారు ఆలోచించుకొంటారు, దానిని కామం అంటారు. కొంతమంది ఎంతసేపు మన స్టేటస్ ఎలా పెంచుకోవాలి అని చూస్తారు, ఇతరుల గురించి ఆలోచించరు, అది కామం. ఇతరుల వెల్ఫేర్ గురించి మనం కొంచెం పని చేసినా దానిని ప్రేమ అంటారు. మనం పని

చేసేటప్పుడు ఏది కామం, ఏది ప్రేమ అని మనకు వివరంగా తెలియాలి. కేవలం పుణ్యకర్మలు చేయటం వలన, సజ్జనులతో సహవాసం చేయటం వలన ఆత్మజ్ఞానం రాదు, ఏదో చేయటం వలన ఇది రాదు. నువ్వు ఎంత పాండిత్యం సంపాదించినా, ధనం సంపాదించినా, సజ్జనులతో సహవాసం చేసినా గురువు యొక్క దయ లేకుండా ఆత్మజ్ఞానం సాధ్యం కాదు. భౌతికవిద్యల వలన నీకు లోచూపురాదు. నువ్వు డీపెన్ అవ్వాలి. నువ్వు హృదయం యొక్క లోతులలోనికి వెళితే జ్ఞానగంగ నీకు దొరుకుతుంది. గురువు అంటే వాడు మనలాగే ఉన్నాడు, మనతోటి తిరుగుతున్నాడు అని అనుకోవద్దు. గురువు అంటే మహాసాగరం. ఆకాశం ఎంత విశాలంగా ఉందో, సముద్రం ఎంత లోతుగా ఉందో గురువు కూడా అలాగ ఉంటాడు, ఆయనకు హద్దులు ఏమీ లేవు. ఆయన మనతో ఇష్టంగా మాట్లాడటం ఎందుకు అంటే మనలను ఆ మహాసాగరంలోనికి లాగేయటానికే ఇవి అన్నీ చేస్తాడు. ఇప్పుడు మనం దేహానికి, మనస్సుకు పరిమితమై ఉన్నాము, ఆ మహాసాగరంలోనికి వెళ్ళాక అక్కడ హద్దులు ఏమీ ఉండవు. మనం ఆ మహా సాగరంలోనికి వెళ్ళకూడదని, వెళితే మన రూపం, నామం పోతాయి అని మనం అనుకొన్నా గురువు అనుగ్రహం కనుక వస్తే మన ఇష్టాలు, అయిష్టాలతో సంబంధం లేకుండా ఆ ప్రవాహం మనలను లాగేస్తుంది. గురువు అనుగ్రహం అంత వేగంగా ఉంటుంది.

గురువు అనుగ్రహానికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. మీరు కూర్చున్న వారు నిలబడకుండా మీకు ఆత్మజ్ఞానం ఇవ్వగలడు. వాడు గురువు. అది ఎలా సాధ్యమండి మాలో చాలా బలహీనతలు ఉన్నాయి, స్వార్థం ఉంది అని మీరు అనుకొన్నా మీ బలహీనతలను, స్వార్థాన్ని, మీ దేహగతమైన నేనును అన్నింటిని బయటకు లాగి కాల్చిబూడిద చేసి మీకు ఆత్మజ్ఞానాన్ని ఇస్తాడు, వాడు గురువు. గురువుది యూనివర్సల్ ఐ, మనది ఇండివిడ్యువల్ ఐ. గురువు చేసే పని ఏమిటి అంటే అటుచూడు, ఇటుచూడు, అది చెయ్యి, ఇది చెయ్యి అని ఇలా తియ్యటిమాటలు మనకు చెపుతూ ఈ ఇండివిడ్యువల్ఐను యూనివర్సల్ ఐలోనికి లాగేస్తాడు. అక్కడకు చేరితే ఇంక దుఃఖంలేదు, టెన్షన్‌లేదు, జన్మలులేవు, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే. కొంతమంది ఎంతసేపు వారినివారు పొగుడుకుంటూ ఉంటారు, ఇతరులను విమర్శిస్తూ ఉంటారు. ఆత్మస్తుతి, పరనింద వలన మనకు అశాంతి వస్తుంది, మనస్సులో పొల్యూషన్ పెరిగిపోతుంది, జ్ఞానసముపార్జనకు ఇవి రెండూ ఆటంకాలు. మిమ్మల్ని మీరు పొగుడుకునే మాటలు, దేహగతమైన నేనును పెంచే మాటలు మీరు ఒక్కమాట కూడా మాట్లాడకూడదు. సహనంలేదు, సహనంలేదు అని అనుకోకూడదు, సహనాన్ని మనం అలవర్చుకోవాలి, సహనం వలన మనం డీపెన్ అవుతాము. తుకారామ్

భార్య తుకారామ్‌ను చెరుకుగెడపెట్టి కొట్టింది, అప్పుడు చెరుకుగెడ రెండు ముక్కలు అయిపోయింది. అప్పుడు తుకారామ్‌కు ఏమీ వికారం రాలేదు ఆయన ఏమన్నాడు అంటే ఒక ముక్క నువ్వు తీసుకో, ఒక ముక్క నేను తీసుకొంటాను తినేద్దాము అన్నాడు, వాడు తుకారామ్. ఆయనను తీసుకొని వెళ్ళటానికి వైకుంఠంలోనుండి విమానం వచ్చింది.

మనం ఏదికాదో అందులోనుండి విడిపోవటం నేర్చుకోవాలి. మనకు ఏమాత్రం వివేకం ఉన్నా మనం ఏదికాదో మనకు తెలుస్తూ ఉంటుంది. అది మనం కాదని తెలిసినప్పడు దానితో తాదాత్మ్యం తగ్గించుకొంటూ వస్తే మనం హృదయగుహలో పడిపోతాము. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని మొదట భగవంతుడు చెప్పాడు. దానిని మనం అందుకోలేము అని ఆయనకు తెలుసు. దేహాభిమానం ఉన్నవారు నిర్గుణాన్ని, నిరాకారాన్ని అందుకోలేరు. మనం సగుణాన్ని, సాకారాన్ని అందుకోగలము కాబట్టి భగవంతుడు మనకోసం రాముడిగా, కృష్ణుడిగా అవతరించాడు. సౌందర్యం మన హృదయంలో ఉంది, నాకు షిరిడీలో ఆంజనేయస్వామి స్వప్నదర్శనం ఇచ్చినప్పడు ఆ రూపాన్ని, ఆ సౌందర్యాన్ని నేను రెండుకళ్ళతోటి చూడలేకపోయాను. ఈ బాహ్యసౌందర్యం చూడలేకే కళ్ళు మూసుకొన్నాను, ఇంక ఆత్మ సౌందర్యం ఎంత అపూర్వంగా ఉంటుందో, ఎంత అద్భుతంగా ఉంటుందో అనిపించింది. గురువుని ఉపాసించటం వలన గురువు యొక్క దయ మనకు కలుగుతుంది. గురువు యొక్క రూపాన్ని ధ్యానించాలి, గురువును స్మరించాలి, ఆయనలోని గుణాలను ఆస్వాదించాలి. మీకు నిద్ర పట్టటంలేదు అనుకోండి మీ ఇష్టదైవాన్నికాని, గురువును కాని స్మరించుకొంటే నిద్రమాత్ర కంటే అది బాగా పనిచేస్తుంది. సాధనాపరంగా ఒకటి మీరు గుర్తు పెట్టుకోండి. మీరు నోటితో ఒక మాట మాట్లాడండి, చేతితో ఒక పని చేయండి, కాళ్ళతో తీర్థయాత్రలు చేయండి, ఇలా మీరు చేసే పనులు, మీరు చేసే సాధనలు అన్నింటితో ఈశ్వరుని దయ సంపాదించాలి, మీరు చెయ్యవలసిన పని అదే. సంపాదన అంటూ ఉంటే ఇదే సంపాదన, ఈశ్వరునిదయను సంపాదించాలి, అదే నిజమైన సంపాదన. ఏదో నిన్న ఆ మంచిపని చేసాము కదా ఈరోజు ఎందుకులెండి అని అనుకోకూడదు. మీకు చేతనైనంతవరకు మంచిపనులు చేస్తూ ఈశ్వరుని దయను సంపాదిస్తూ ఉండాలి. మనం ఈశ్వరుని దయను సంపాదిస్తే ఆయనే మనలను జ్ఞానంతో అలంకరిస్తాడు.

రాముడికి జ్ఞానం ఉందా అని ఎవరో భగవాన్‌ను అడిగితే ఆయన ఏమి చెప్పారు అంటే రామ, రామ అని నీవు ఆయన నామాన్ని స్మరించటంవలన నీకు జ్ఞానం కలుగుతూ ఉంటే ఆయన జ్ఞానం లేకుండా ఎలా ఉంటాడు, అదేమి ప్రశ్న అన్నారు. ఒకో శరీరానికి ఒకో

పనిని భగవంతుడు కేటాయిస్తాడు. మీ శరీరం ద్వారా ఏ పని జరగవలసి ఉందో దానిని మీరు వద్దు వద్దు అన్నా, దానిని మీరు విడిచిపెట్టాలన్నా లాభంలేదు, మొట్టికాయలు మొట్టి ఈశ్వరుడు ఆ పనిని మీచేత చేయిస్తాడు. పట్టుకోవటం మీ ఇష్టంకాదు, విడిచిపెట్టటం మీ ఇష్టం కాదు. ఎక్కడో ఒకచోట మౌనంగా ఉండాలి, ఇంక ఏమి చెప్పకూడదు అని మాకు అనిపిస్తుంది కాని టీచింగు పెరిగిపోతోంది. పూర్తిగా నూటికి నూరు పాళ్ళు ఇష్టంగా చెప్పటం లేదు, పరిస్థితులు అలా వస్తున్నాయి, టీచింగ్ సాగిపోతోంది. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నీ దేహప్రారబ్దంలో ఏ పని అయితే ఉందో దానిని చెయ్యక తప్పదు. ఆ పనిని అయిష్టంగా చేసే బదులు ఇష్టంగా, శ్రద్ధగా చెయ్యి, అదే యోగం. అలా చేయటం వలన పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు, అప్పుడు వాసనాశూన్యస్థితి వస్తుంది. వాసనాశూన్యస్థితి ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు వర్షాకాలంలో ఆకాశంలో మెరుపు మెరిసినట్లుగా ఒక్కసారిగా లోపల ఉన్న వస్తువు తళుక్కున మీకు స్ఫురిస్తుంది, దాని తాలుక రుచి మీకు తెలుస్తుంది. ఆ రుచి మీకు తెలిసాక దానిని పట్టుకోవాలని బలంగా సాధన చేస్తారు, అప్పుడు అదే మిమ్మల్ని లోపలకు లాగేస్తుంది. బుద్ధుడుగాని, రమణుడుగాని మనలను దుఃఖస్పర్శలేని స్థితికి తీసుకొనిపోవటానికి ప్రయత్నం చేసారు. మనం ఆర్థికపరమైన అభివృద్ధిని కోరుకొంటున్నాము కాని ఆధ్యాత్మికఅభివృద్ధిని కోరుకోవటంలేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియదు, దాని విలువను మనకు తెలియజేసి, ఆ స్థితిని మనం పొందేలా చేయటమే గురువు చేసేపని.

కొంతమంది గంటకోరకంగా ఉంటారు. వారిమాటలో స్థిరత్వం ఉండదు, ఆలోచనలో స్థిరత్వం ఉండదు. మనం అలా ఉండకూడదు. ఆలోచించుకోవటానికి భగవంతుడు మనకు బుద్ధిని ఇచ్చాడు. ఎవరో ఏదో చెప్పారని ఆ మాటలు భుజాన వేసుకొని తిరగకూడదు. ఏది ధర్మం, ఏది అధర్మం అని నీకు ఏదైనా డౌటు వస్తూ ఉంటే ఎవరో చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవద్దు, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో అని పరమాత్మ చెప్పాడు. మీరు శాస్త్రం చదివేటప్పుడు శాస్త్రం మీద మీకు గౌరవంకలుగుతూ ఉంటే ఈశ్వరుడి యొక్క అస్థిత్వం మీద సజీవమైన విశ్వాసం వచ్చేస్తుంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం మీకు కలిగితే ఆధ్యాత్మికంగా నూటికి యాభై మార్కులు వచ్చేస్తాయి. మీరు పెద్దపండితులు అయినా, పెద్ద ధనవంతులు అయినా మీకు బాహ్యంగా ఎన్ని ఉన్నా మనోనిగ్రహం లేకపోతే వాడు పశువుతో సమానము. అంటే మనోనిగ్రహం చాలా ముఖ్యం. మాట్లాడే మాటలను బట్టి ఆ మనిషికి ఎంతవరకు కంట్రోలు ఉందో చెప్పవచ్చు. మాటలు పొందికగా ఉన్నవాడి మనస్సు ఒకరకంగా ఉంటుది, లూజ్‌టాక్ ఉన్నవాడి మనస్సు

వేరొకరకంగా ఉంటుంది. మనకు చెడ్డ సలహాదారులు దొరికారు అనుకోండి, వారి కూడా పడితే మరణానికి ముందు అశాంతి, మరణానంతరం నరకం అంటే ఇక్కడా సుఖంలేదు, అక్కడా సుఖంలేదు. చెడ్డ సలహాదారులు చాలా ప్రమాదం, వారు కూడా మన ప్రారబ్ధాన్ని బట్టి సిద్ధమవుతారు. మనకు పూర్వపుణ్యం ఉంటే మంచి సలహాదారులు దొరుకుతారు.

ఎవరికైతే మైండ్ కంట్రోలు ఉందో వారితో సహవాసం వలన మన ప్రయత్నం పెద్ద అవసరం లేకుండానే మనకు నార్మల్‌గా, నేచురల్‌గా మనోనిగ్రహం వచ్చేస్తుంది. ఈ ప్రపంచం అసుఖం, అనిత్యం అని పరమాత్మ చెప్పాడు. ఈ లోకంలో సుఖం ఉందని మీరు అనుకొంటున్నారు కాని మీకు ఏదైనా సుఖంగా కనిపిస్తున్నా అది అంతా భవిష్యతులో నీకు దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. ఒక భక్తుడు ఏమి చెప్పాడు అంటే మీరు సజ్జన సహవాసం చేసి మీలోపల ఉన్న కల్మషాన్ని పోగొట్టుకొంటే మీలోపల ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకొంటే ఈ ప్రపంచం అంతా సుఖమయంగా మీకు కనిపిస్తుంది అంటే హోలీకంపెనీ వలన సుఖమయం అయిపోతుంది అని చెప్పాడు. గురువుపట్ల మనం కృతజ్ఞత కలిగి ఉండాలి. స్కూలులో, కాలేజీలో పాఠాలు చెప్పేవాడు గురువుకాదు. గురువు అంటే ఏదో బాహ్యమైన విద్యను చెప్పటంకాదు, నీ బిహేవియర్ ఎలా ఉందో చూస్తూ, నీలో ఉన్న బలహీనతలను ఎలా తొలగించుకోవాలో నీకు బోధిస్తూ, దానికి తగిన శక్తిని ఇస్తూ వాటిలో నుండి నిన్ను విడుదలచేసేవాడే గురువు. గురువు అంటే ఏదో బోధ చేయటంకాదు, ఆయన చాలా బాధ్యత తీసుకొంటాడు. అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి వచ్చేవరకు మిమ్మల్ని వెంటాడతాడు, వాడు గురువు. గురువుతో మనకు ఉన్న అనుబంధం జన్మాంతరంలో నుండి వస్తుంది. గురువు ఏ స్థాయిని పొందాడో ఆ స్థాయిని మనచేత పొందింపచేసేవరకూ ఆయన మనలను విడిచిపెట్టడు. వాడు గురువు. ఇండివిడ్యువల్ ఐలో నుండి బయటకు లాగి యూనివర్సల్ ఐలో మనలను కలపటానికి గురువు నెమ్మదిగా, స్టడీగా ప్రయత్నం చేస్తాడు. ఒకవేళ నువ్వు కంగారుపడినా ఆయన కంగారుపడడు. నిన్ను అప్పుడప్పుడు నొక్కుతూ ఉంటాడు, నువ్వు డిజర్వు అవుతున్నావో లేదో చూసుకొంటాడు. నువ్వు డిజర్వు అవ్వకపోతే వెయిట్ చేస్తాడు. మరల కొంతకాలం తరువాత నువ్వు డిజర్వు అవుతున్నావా అని చూస్తాడు, నీకు మెచ్యూరిటీ కలుగజేస్తాడు. ఎప్పుడైతే నువ్వు 100% స్వీట్ అయిపోయావో, 100% ఫిట్ అయ్యావో అప్పుడు నిన్ను శ్వాలో చేసేస్తాడు, వాడు గురువు. బ్రాహ్మీస్థితి పొందటానికి మన మనస్సే మనకు అడ్డువస్తోంది. ఆ మనస్సును మీకు తెలియకుండా శ్వాలో చేసేస్తాడు అది గురువు చేసే పని, అది నీ కళ్లకు కనబడదు. కొంతమంది బోధచేయరు కాని వారు ఏ స్థితిని పొందాలో ఆ స్థితిని పొంది ఉంటారు, అటువంటివారు నోటితో మాట చెప్పనక్కరలేదు,

మనకు జ్ఞానోదయం కలగటానికి, మన హృదయంలో మనం మేల్కోవటానికి వారి ప్రెజెన్స్ సరిపోతుంది. నీలో ఒక మహాశక్తి ఉంది. ఆశక్తి మేల్కొన్నప్పుడు నీద్వారా ఇతరులకు సహాయ సహకారములు అందకుండా ఎలా అపుచేయగలవు. వీరందరికి ఆ శక్తి పంచిపెట్టాలని నీవు అనుకోవు, నీద్వారా ఆ శక్తి ఇతరులకు అందుతుంది, దానిని బట్టి అనేకమంది లాభాలు పొందుతారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-06-2009, కైకలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అజ్ఞానం అంతా మన మనస్సులోనే ఉంది. బంధం ఎక్కడ ఉంది అంటే మన మనస్సులోనే ఉంది. బయట అసలు ఏమీ లేదు. అందుచేత మనస్సును మీరు అదుపులో పెట్టుకుంటే మీరు భక్తులు. మీ మనస్సుని మీరు అదుపులో పెట్టుకోలేకపోతే మీరు భక్తులు కాదు. మనస్సు ఎవరికైతే అదుపులో లేదో, ఇంద్రియ సుఖాలపట్ల ఎవరికైతే ఎక్కువ ఆసక్తి ఉందో, జీవితం అంటే ఇంద్రియాలతోటి భోగాలు అనుభవించి చనిపోవటమే, ఇంక మరణానంతరజీవితం లేదని ఎవరైతే అనుకుంటున్నారో వారే రాక్షసులు అని ఈశావాక్యోపనిషత్తులో చెప్పారు. ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత ఐశ్వర్యం ఉన్నా, ఎంతకీర్తి ఉన్నా వాడికి మనోనిగ్రహం కనుక లేకపోతే పశువుతోటి సమానం అని ఒక ఋషి చెప్పాడు. కొంతమంది ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను కూడా పాడైపోతారు. ఈ లోకానికి పనికిరారు, పరలోకానికి పనికిరారు. దానికి కారణం వారి మనస్సే. మీ మనస్సును మీరు అదుపులో పెట్టుకోవటం చాలా ముఖ్యం. కొంతమంది ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను అభివృద్ధిలోనికి వస్తున్నారు అనుకోండి వారి మనస్సు సరియైన మార్గంలో ఉందని, వారి మనస్సు అదుపులో ఉందని అర్థం. మనం పాడైపోయినా మన మనస్సే కారణం, మనం బాగుపడినా మన మనస్సే కారణం. మనస్సు వచ్చాక ఏదైతే వస్తోందో అవి అన్నీ కూడా మనస్సు ఎంత నిజమో అవీ అంతే నిజం. ఇవన్నీ సాపేక్షిక సత్యాలు కాని పారమార్థిక సత్యము కాదు. మనస్సు ఉంటే అన్నీ ఉన్నాయి, మనస్సు లేకపోతే ఏదీ లేదు అని భగవాన్ అన్నారు. ఒక ప్రక్కన దేహాభిమానం పెట్టుకొని, జీవలక్షణాలు పెట్టుకొని దేవుడు అసత్యం, లోకం అసత్యం అని చెబితే మీకు ప్రమాదం ఎదురు అవుతుంది అని రామకృష్ణుడు అన్నారు.

మన మనస్సుని నిగ్రహించుకోవటానికి కేవలం మన తెలివితేటలు సరిపోవు. స్వప్రయత్నం ఉండాలి, దేవుని అనుగ్రహం ఉండాలి. మనం సాధన చెయ్యగా, చెయ్యగా

కొంత అనుభవం వస్తూ ఉంటుంది. లోపల ఏదో ఉంది, అది మనకి అర్థం కావటంలేదు అని లోపల స్ఫురణ మనకి తెలుస్తూ ఉంటుంది. మరల చెదిరిపోతూ ఉంటుంది. దీనికి ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీకు అనుభవం వచ్చినా నీకు చిరకాలం నుండి వచ్చిన భ్రాంతి అక్కడ ఉండనివ్వదు. ఆ వాసనలోంచి నువ్వు బయటకు రాలేవు. నీకు వచ్చిన అనుభవం నెమ్మదిగా స్థిరపడుతూ ఉంటే వాసన రాలిపోతుంది అని చెప్పారు. మనస్సుని నిగ్రహించుకోవటం చాలా కష్టం. మనం మనస్సుని నిగ్రహించుకుంటే అంతకు మించినది ఏమీలేదు. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది అదొక రకమైన దురద. దీనివలన మనస్సు పాడైపోతుంది అని మీకు తెలియదు. ఆచార్యులవారు అన్నారు నిన్ను ఇతరులు పొగిడినా, నిన్ను నువ్వు పొగుడుకున్నా వీటి వల్ల ప్రయోజనం లేదు. దీనివల్ల నీ మనస్సు కొంత చల్లబడుతుంది. కాని ఈ పొగడ్తల వల్ల నీ భక్తి కాని, ఆధ్యాత్మిక ఉన్నతికాని, నీ చైతన్యస్థాయి కాని ఏమీ పెరగదు. ఈ పొగడ్తలకి లోనవ్వటం వలన మరల ప్రపంచంలో కూరుకుపోతావు. నువ్వు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ఈశ్వరుడి పాదాలకు నువ్వు అంటుకుపోవాలంటే పొగడ్తలు నీకు ఏమీ ఉపయోగపడవు, అవి ఉపయోగపడనప్పుడు నిన్ను ఇంకొకరిచేత పొగిడించుకున్నా, నిన్ను నువ్వు పొగుడుకున్నా అల్లరికాని ఇందులో ఏమీ ప్రయోజనం లేదు అని చెప్పారు. బుద్ధిమంతుడికి పబ్లిసిటీ అక్కరలేదు.

భగవంతుడు చెప్పిన ప్రతీవాక్యం నిజం. మనకి ఆప్తుడే అబద్ధం చెప్పడు. ఇంక భగవంతుడు ఎందుకు అబద్ధం చెబుతాడు. ఆప్తులు అంటే మన చుట్టాలు, స్నేహితులు కాదు. ఎవరికైతే ఇంద్రియ నిగ్రహం ఉందో, మనోనిగ్రహం ఉందో, ఎవరైతే మన క్షేమం కోరుతున్నారో, ఎవరైతే తపస్సు చేసి పవిత్రుడు అయ్యాడో వాడు చెప్పిన వాక్యం ఆప్తవాక్యం, వాడు చెప్పినది ఆచరించదగినది. ఆప్తవాక్యమే, ఇలా ఉన్నప్పుడు భగవంతుడి వాక్యం ఎలా ఉంటుంది. ముందు అసలు భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ప్రభువు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మనకి ఉండాలి. రామకృష్ణుడు ఏమని చెప్పాడంటే మీరు జీవన్ముక్తులు అవ్వాలంటే ఈ శరీరం అనేది ఒక యంత్రం. ఈ శరీరాన్ని ఆడించేవాడు నారాయణుడు లోపల ఉన్నాడు. ఆడించేవాడు ఆయన, ఆడేవాడిని నేను అనే నిశ్చయం మీకు దృఢంగా ఉంటే మీరు ఇప్పడే, ఇక్కడే జీవన్ముక్తులు అవుతారు అని చెప్పారు. ఇది నీకు అర్థమైతే వంద శాస్త్రాలు చదవనక్కరలేదు. అంటే నోటితోటి చెప్పటంకాదు అది మీ గుండెకు తాకాలి. అప్పడు మీ మనస్సులో ఉన్న అశాంతి కాలిపోతుంది. రామకృష్ణుడు ఇలా మాట్లాడుతూ ఉంటే ఒక తెలివైనవాడు అన్నాడు మానవ జీవితం, ఈ ప్రాపంచిక జీవితం అంతా భగవంతుడి సంకల్పం ప్రకారం నడుస్తూ ఉంటే మీరు ఈ బోధ

చెప్పటం ఎందుకు అన్నాడు. నేను ఎవడిని చెప్పటానికి. అమ్మ నా పక్కన కూర్చుని జ్ఞానాన్ని పోసేస్తోంది అది నేను పంచిపెడుతున్నాను. నేను డిస్ట్రిబ్యూటర్‌నే. చెప్పటం అయిపోయింది అనుకోండి మళ్ళీ సప్లై చేస్తోంది ఇది కూడా చెప్ప అని. అమ్మ ఎలా చెప్పమంటే అలా చెబుతున్నాను. నేను లేను నానోటితో అమ్మ పలుకుతోంది అన్నారు. మీ దేహానికి ఏదైనా ప్రారబ్ధం ఉంది అనుకోండి, ఈ ప్రారబ్ధం అనుభవించాలని భగవంతుడు చెప్పడు. ఆ రకమైన మనుషుల్ని నీ దగ్గరకు చేరుస్తాడు, ఆ పరిస్థితులు తీసుకువస్తాడు. ఆ ప్రారబ్ధానికి అనుగుణంగా నీ శరీరాన్నితోలుతూ ఉంటాడు వాడే ఈశ్వరుడు.

ఒకసారి రమణమహర్షి గారిని దేవుడు ఉన్నాడా? మీరు దేవుడిని చూసారా అని అడిగారు. ఆ కొండ వంక చూపించి వాడే దేవుడు వాడిని చూసాను కదా! నేను చూచినట్టు నువ్వు కూడా చూడు అన్నారు. నువ్వు నీ శరీరంతోటి ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో అలా శివుడు కూడా ఆ కొండతోటి తాదాత్మ్యం పొందుతున్నాడు. ఈ దేహం నాది నాది అని నువ్వు ఎలా అనుకుంటున్నావో, శివుడు కూడా ఆ కొండని నేను నేను అనుకుంటున్నాడు అన్నారు. అయితే దానికి విశ్వాసం ప్రధానం. అగస్త్యమహర్షి అరుణాచలాన్ని దర్శించాడని నేను పురాణంలో చదివాను అదంతా నిజమేనా అని భగవాన్‌ని అడిగారు. అగస్త్య మహర్షి ఏమిటి ప్రతీవాడూ ఇక్కడికి రావలసిందే అన్నారు. అంటే దాని అర్థం అరుణాచలం అంటే హృదయం అని ప్రతీవాడూ హృదయం దగ్గరకి వస్తేనేగాని వాడికి ఆత్మజ్ఞానం కలగదు. మీ తలకాయలో మీరు ఎంత సహజంగా ఉంటున్నారో అంత సహజంగా మీ హృదయంలో మీరు స్థిరపడేవరకూ మీకు జ్ఞానం కలుగదు. హృదయంలోకి అందరూ చేరుకోవలసిందే. మన మనస్సుకి ఉత్పత్తి స్థానం హృదయం. మనస్సు హృదయంలో ఉత్పత్తి అవుతుంది, శిరస్సులో విజృంభిస్తుంది. నువ్వు ఇప్పుడు శిరస్సులో ఎలా ఉంటున్నావో అంత సహజంగా నీ మనస్సు హృదయంలో ఉండగల్గితే అప్పుడు మనోనాశనం అవుతుంది. మనస్సు అణగటం వేరు, మనస్సు నశించటం వేరు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనస్సు అణిగి ఉంటుంది పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు మనస్సు బుసలు కొట్టేస్తుంది. మనస్సు చెప్పినట్టు నువ్వు వినకూడదు. నువ్వు చెప్పినట్టు నీ మనస్సు వినాలి. మీరు భగవదనుభవం పొందటం కోసం సాధన చెయ్యాలి. మీరు ప్రయత్నం చెసేటప్పుడు అది నిశ్చయంగా ఉండాలి. మనం ఈ ప్రయత్నం చేద్దాము ఈ ప్రయత్నంలో శరీరం ఉంటే ఉంటుంది లేకపోతే ఈ ప్రయత్నంలో శరీరం పోయినా ఫరవాలేదు కాని మనం భగవదనుభవం పొందాలి అని ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నంలో మనం ఫెయిల్ అయిపోతున్నాము అనుకోండి అయినా ప్రయత్నం విడిచిపెట్టకూడదు. దానిని సాధించాలి అని ప్రయత్నం అలా చేస్తూనే

ఉండాలి అంటే గమ్యం మరచిపోకూడదు.

ఆత్మసాక్షాత్కారం పొందాలి అనే కృతనిశ్చయం మీకు ఉండాలి. ఆ నిశ్చయం కూడా దైవానుగ్రహం లేకపోతే మీకు రాదు. ఆత్మజ్ఞానం పొందకుండా నువ్వు సాధించటానికి ఇంక ఏముందివయ్యా ఈ ప్రపంచంలో అనేవారు భగవాన్. నీ స్వరూపం నువ్వు తెలుసుకోవటం కంటే మించినపని ఏదైనా ఈ లోకంలో ఉందా? అసలు దాని విలువ మనకు తెలియాలి. వస్తువు యొక్క విలువ తెలిస్తేనేగాని దాని గురించి సాధన చేయలేము. మీ దేహప్రారబ్ధాన్నిబట్టి మీ కోరికలు కొన్ని నెరవేరతాయి అప్పుడు పొంగిపోకండి ఇదీ అబద్ధమే, ఒకోసారి మీరు ఎంత కోరుకున్నా, ఎంత ప్రయత్నం చేసినా ఆ కోరిక నెరవేరదు అప్పుడు కుంగిపోకండి అదీ అబద్ధమే. ఇంక పొంగిపోవటం ఎందుకు, కుంగిపోవటం ఎందుకు. ఈ రెండూ వదులుకోండి అన్నాడు పరమాత్మ. మీరు ఎక్కువ పొంగిపోతున్నారు అనుకోండి అప్పడూ మనస్సు విజృంభిస్తుంది. మీరు ఎక్కువ కుంగిపోయారు అనుకోండి అప్పడూ మనస్సు విజృంభిస్తుంది. అప్పుడు మీరు జపం చేసినా మీ మనస్సు స్వాధీనంలోనికి రాదు. భగవాన్ చెప్పేవారు మీరు చేసిన తపస్సులకంటే యోగాభ్యాసాల కంటే, మీరు చేసిన జపసాధనలకంటే ఒక గురువు యొక్క దయ చాలు మీ మనస్సు అదుపులోకి రావటానికి. మీరు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎంత పాండిత్యం మీకు వచ్చినా గురువు దయతో అది సమానము కాదు. మీరు సాధన బాగా చేయలేకపోతున్నారు అనుకోండి హోలీకంపెనీ చూచుకోండి. హోలీకంపెనీ వల్ల కూడా మీరు పవిత్రులు అవుతారు. మనం పని చెయ్యాలి. ఎక్కడా ఎటాచ్‌మెంటు ఉండకూడదు. మనకి ఎక్కడా ఎటాచ్‌మెంటు లేదు అనుకోండి ఇంక మన మనస్సు కదలమంటే కదలదు. ఈ ప్రపంచం అంతా మనస్సు కల్పితం. బయట ఏదో జరిగినట్టు మనకి అనిపిస్తోంది కానీ అంతా మన మనస్సులోనే జరుగుతోంది. మీరు బయట శుచిగా ఉండాలి లోపల కూడా శుచిగా ఉండాలి అంటే మీ మనస్సుని శుచిగా ఉంచుకోవాలి. శరీరం ఆరోగ్యంగా ఉండాలి, మనస్సు ఆరోగ్యంగా ఉండాలి. మానసికఆరోగ్యం పాడైపోయే పనులు మీరు చేయకూడదు. మనస్సుకి వేరుగా బంధం లేదు. మనస్సు రూపంలోనే బంధం ఉంది. అవిద్య మనోరూపంలోనే ఉంది. అజ్ఞానము మనోరూపంలోనే ఉంది. మీరు ఏ పని చేసినా ఒక్క ఓర్పు సరిపోదు, నేర్పు కూడా ఉండాలి, ఆ పని సమర్థతగా చెయ్యాలి. ఇంతకంటే ఆ పని ఎవరూ బాగా చేయలేరు అన్నంతబాగా చెయ్యాలి అదీ దక్షత అంటే.

సమర్థత ఉన్నవాడు ఎక్కువ గౌరవాన్ని కోరడు వారు సమర్థత మీద వారే ఆధారపడి ఉంటారు. గౌరవం అనేది ఒక బానిసత్వం. మీరు గౌరవం సంపాదించాలనే గొడవ

వదిలేయండి. అది మీరు వదిలేస్తే లోకవాసనపోతుంది, బాహ్యంగా సుఖపడటమేకాదు ఆత్మసుఖం మీకు అందుతుంది. కీర్తిపట్ల అపేక్ష ఉన్నవారు గ్రౌండు రియాలిటీస్‌కి దూరంగా ఉంటారు. దీనికి భగవాన్ అన్నారు ఒక వేశ్య యొక్క దాస్యంలోంచి మనిషి బయటకు రాగలడుగాని కీర్తికాంక్షలోంచి మనిషి బయటకు రాలేడు అన్నారు. కీర్తకాంక్ష నిన్ను బంధిస్తుంది. నీ మనస్సు నీకు అదుపులో లేకుండా వెళ్లిపోతుంది. నువ్వు చివరకు భగవంతుడి దయకోసం ఒక్క పనీ చెయ్యవు. కీర్తి వస్తుందంటే పని చేస్తావు. ఇంక కీర్తి రాదంటే ఏ పనీ చెయ్యవు. మంచాన్ని పట్టిన ముసలివారికి కామక్రోధాలు తగ్గిపోవచ్చు కాని కీర్తి కాంక్ష పోదు. అంటే మీకు పునర్జన్మలు తీసుకురావటానికి ఇది కూడా వాసన. ఆత్మకి కీర్తి అక్కరలేదు అహంకారానికే కీర్తి కావాలి. అంటే నువ్వు కీర్తిని కోరుకుంటున్నావు అంటే నీ అహంకారాన్ని పెంచుకుంటున్నావు. మనకి లోపల బంగారం ఉంది. ఆ బంగారం మన కళ్లకి కనబడకుండా పైన మూత పెట్టారు. ఆ మూతే అహంభావన. ఆ మూతనుతీసి వాడు బయట పడేయలేడు ఎందుచేతనంటే వాడికి అది ఇష్టంగా ఉంది. ఆ మూతను తొలగించకపోతే లోపల ఉన్న బంగారం వాడికి కనిపించదు. ఆ మూతను నువ్వు గెంటగలిగితే లోపల ఉన్న బంగారం నీకు లభ్యమవుతుంది. వెయ్యి జన్మలు ఎత్తినా నువ్వు ఆ మూత తియ్యవు. ఎందుచేతనంటే నీ జీవితంలో నీ భర్తకంటె, నీకు ఉన్న ఆస్తిపాస్తులకంటే అహంభావన అనే మూతే నీకు ఎక్కువ ఇష్టం. మాయ అంతా అక్కడే ఉంది. అది మనకి ఎంతపనికి రానిదైనా అది అంటే మనకి చాలా ఇష్టంగా ఉంది. అందుచేత దానిని విడిచిపెట్టలేకపోతున్నాము. శాస్త్రాన్ని కూడా మీరు విసుగువచ్చేలా వినాలి. అహంభావన అనేది మూతలాగ ఉంది. నీ హృదయంలో ఉన్న బంగారాన్ని అది కనబడనివ్వటంలేదు అని ఇలా రిపీటెడ్‌గా వింటూ ఉంటే ఎప్పుడైనా ఆ మూత తీసేద్దాము అనే బుద్ధి మీకు కలుగుతుంది, వినకపోతే ఆ బుద్ధి మీకు కలగదు.

మీరు ఎవరినీ ద్వేషించవద్దు. ప్రేమ నెమ్మదిగా నడుస్తుంది. ద్వేషం చాలా స్పీడుగా వెళ్లిపోతుంది. మీకు ఎవరిమీదైనా ద్వేషం ఉంటే వారే మీకు అస్తమానూ జ్ఞాపకం వస్తారు ఇంక దేవుడు జ్ఞాపకం రాడు. మీకు ద్వేషం ఉంటే మనస్సు బాహ్యముఖానికి వెళ్లిపోతుంది. బాహ్యముఖానికి వెళ్లిపోతే అహంకారం పెరిగిపోతుంది. మీకు శాంతి దొరకదు. అందుచేత వారు చెడ్డవారు అయినా మీరు ద్వేషం పెట్టుకోవద్దు మీకు ఇష్టం లేకపోతే వారితోటి స్నేహం మానేయండి. మీరు జరిగిపోయిన గొడవలు అస్తమానూ తలపెట్టుకోవటంకంటే వర్తమాన కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. అంతటా వ్యాపించిన వస్తువు మనలాగ కాళ్లుచేతులు తొడుక్కుని వస్తే వాడిని పరమాత్మ అని ఎలా అనుకుంటాము. పరమాత్మని గ్రహించటానికి

అంత పుణ్యబలం మనకు లేదు. ధర్మరాజు ఉత్తముడే. భారతయుద్ధంలో పరమాత్మ అబద్ధం చెప్పమంటాడు, ధర్మరాజు అబద్ధం చెప్పను అంటాడు. నన్ను ఎవరు అనుకుంటున్నావు అని అడుగుతాడు. నువ్వు ఈశ్వరుడవని నాకు తెలుసు అంటాడు. అయితే అబద్ధం చెప్పటానికి నీకు భయం ఏమిటి? అంటే నాకు పాపం వచ్చేస్తుంది అంటాడు. నీ పాపాన్ని నేను మోస్తాను అంటాడు పరమాత్మ. అప్పడు అబద్ధం చెబుతాడు. నీ పాపాల్ని నేను భరిస్తాను అని ఎవరు చెప్పగలరు. అది ఈశ్వరుడికే సాధ్యం. నిజంగా ఆయన భరించగలడు. మన పాపాల్ని మనమే భరించలేకపోతున్నాము మళ్ళీ ఇంకొకరి పాపాలను మనం ఎలా భరించగలము. మనం మోయలేము. మీరు జీవుడు కాబట్టి భరించలేరు. అందుచేత పరమాత్మని గుర్తించటం చాలా కష్టం. మన అహంకారం భగవంతుడిని గుర్తించనివ్వదు. అది భీష్ముడికి సాధ్యం అయ్యింది, ధర్మరాజుకి సాధ్యం అయ్యింది.

మీరు దేనికి శోకించకండి, దేనిని ద్వేషించకండి, దేనిని కాంక్షించకండి. ప్రపంచంలో ఏ వస్తువు మీద కాంక్ష పెట్టుకోవద్దు. మీ దేహప్రారబ్దంలో ఉంటే ఆ వస్తువు మీదగ్గరకు వస్తుంది. మీ దేహప్రారబ్దంలో లేదు అనుకోండి మీరు ఎంత ప్రయత్నం చేసినా రాదు. భగవాన్ అసలు ప్రారబ్దమే లేదు అన్నారు. నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అని ఎవరు అనుకుంటున్నారు? నీ మనస్సు అనుకుంటోంది. ఆ మనస్సుని తీసుకువెళ్ళి ఈశ్వరుడికి శరణాగతి చేస్తే, ఈశ్వరుడి పాదాలముందు పెడితే అసలు ప్రారబ్దం అనుభవిస్తున్నట్టు కూడా నీకు తెలియదు అన్నారు, నీ చావు అబద్ధం, నీ పుట్టుక అబద్ధం. ఇవన్నీ మనో కల్పితములు. అసలు నీ స్వరూపం తెలుసుకోవటం మానేసి చావు గురించి, పుట్టుక గురించి ఆలోచిస్తావేమిటి? అవి నిజం కాదు. ఎవడైతే నేను పుట్టాను అనుకుంటున్నాడో వాడిని రంపం పెట్టి కోసేసినా వాడికి మోక్షం రాదు అని చెప్పారు. ఏదైతే నువ్వు అయి ఉన్నావో దానికి పుట్టుక లేదు. ఆ పుట్టుక లేని దానిని పుట్టుక లేనిదానిగా నువ్వు తెలుసుకుంటే అప్పడు నీకు మోక్షం. అదే చైతన్యం. నువ్వు మంచివాళ్ళతోటి స్నేహం చేస్తే నువ్వు చెడ్డవాడివి ఎలా అవుతావు. చెడ్డవాడు అవ్వలేవు. అలాగే చైతన్యాన్ని ఆశ్రయించి, చైతన్యాన్ని స్మరిస్తూ, చైతన్యం కోసం జీవిస్తూ ఉంటే నీకు జడబుద్ధి పోయి చైతన్యబుద్ధి కలుగుతుంది. ఇంక నీకు పుట్టుకలు, చావులు ఏమిటి? ఆవు పుట్టగానే దూడమీద ఉన్న మాయను ఆవు ఎలా నాకేస్తుందో అలాగ నాకు ఇష్టులైనటువంటి వారి బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే, నా స్వరూపం అందకుండా ఏ ఆటంకాలు అయితే వారి బుద్ధిలో ఉన్నాయో ఆ దోషాలన్నీ నాకేసి, వారిని ఆ పాపాల్లోంచి, ఆ దోషాల్లోంచి విడుదలచేసి శుభ్రం చేసి నా స్వరూపాన్ని వారికి ఇస్తాను అని పరమాత్మ చెప్పాడు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగష్టు | 7 | తాడినాడ, కృష్ణాజిల్లా |
| ఆగష్టు | 13 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు (కృష్ణాష్టమి) |
| ఆగష్టు | 20 | మురమళ్ళ, శివాలయం |
| సెప్టెంబర్ | 1 | అయిభీమవరం |
| సెప్టెంబర్ | 6 | చింతపర్రు |
| సెప్టెంబర్ | 13 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |



సద్గురు నాన్నగారితో హైదరాబాదు శ్రీ రమణ భక్తులు



శ్రీ సద్గురు నాన్నగారితో సత్యసాయి నిగామము మేనేజింగు డైరెక్టరు

# లోపాలే - పాపాలు

ఈ లోకంలో మనం చీకటిలో నరమాత్రుడు కూడా చూడని ప్రదేశంలో నవ్వుతూ చేసే పాపకార్యాన్ని, హింసాకార్యాల ఫలితాలను ఈశ్వరుడు వెలుగులోకి తీసుకొని వచ్చి వాటిని మనతో ఏడుస్తూ అనుభవించేలా చేస్తాడు. ఆ కుటుంబాలకు ముళ్ళు వేసాను తన్నుకు చస్తున్నారు అని ఆనందిస్తే ఆ బీట ముళ్ళు విప్పకోవటానికి తరువాత ఎన్నో జన్మలు పడతాయి. కారణం లేకుండా కార్యం ఉండదు. హేతువు లేకుండా తీతువు మోగదు. శివుని ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదు అని గ్రహించాలి. ఇతరులను తుచ్ఛులుగా, పాపులుగా చూడటమే అన్నింటికంటే గొప్ప పాపము. ఏదైనా ప్రతికూల పరిస్థితి తటస్థించినప్పుడు మన మనస్సు స్వాధీనం తప్పతుంది. దాన్ని వివేకంతో సరిచేసుకోవాలి. సమస్త పాపాలకు, దుఃఖాలకు, సనుగుళ్ళు గానుగుళ్ళు లేకుండా ప్రశాంతంగా భరించాలి. కారణం అవి అన్ని మనం చేసుకొన్నవే. మనకు అపకారం జరిగిందని ప్రతిఘటించి తిరిగి దెబ్బకొడదామని ప్రయత్నించకూడదు. మన కర్మలను మనచేత అనుభవింపజేస్తున్న భగవంతుని చేష్టలను మనం కప్పి పుచ్చుకోకూడదు. ఎవరైనా మనతో విరోధం పెట్టుకొంటే వారి గురించి బయపడకూడదు. మనలను పొగిడేవారిగురించే భయపడాలి. అభిమానం ఎంత వరకూ ఉంటుందో అంతవరకూ ముక్తిలేదు. వైఫల్యాలు, అనుకూలాలు, దరిద్రం, సంపద నిగ్రహించుకోకపోతే భంగపాట్లు కలిగిస్తాయి. అవి మానసిక బుడగలు మనం వాటిని పెద్దవి చేసుకొంటూ వాటి వెంట పరుగిడతాము. అవి ఒకప్పుడు ప్రేలిపోతాయి. అవి అన్ని ఆంతరంగిక భావాల కల్పనలే. గాఢనిద్రలో అవి లేవు అవి అన్ని స్వప్న సమానం. ఈ విషయం గురు అనుగ్రహం ఉన్నవానికి, అమనస్కస్థితిలో ఉన్న వానికి మాత్రమే తెలుస్తాయి. మానవుడు మానసికంగా చేసే ప్రతీ తప్పడు పనికీ ప్రతిఫలంగా చెల్లించే సుఖమే భయం. ధార్మికునికి వ్యాకులత ఉండదు. శ్రీనాన్నగారు "మనకు దుఃఖం వస్తూ ఉంటే ఇతరులు కారణంకాదు ప్రారబ్దం ప్రకారమే వస్తూ ఉంటుంది. మనచేత అవమానం పొందినవారు స్వర్గానికి వేడతారు మనం నరకానికి వెడతాము ఇది యదార్థం. మన సమస్యలను మనమే సృష్టించుకొని మన జీవితాన్ని మనమే బుగ్గిపాలు చేసుకోకూడదు" అన్నారు. అసూయ, మమకారాలు ఆకాశంలో మేఘాల్లాంటివి ఒకటి ఏనుగు ఒకటి చిలక అవి మరుక్షణంలో వెళ్ళిపోతాయి. మనం బాధపడకూడదు. మన అంతరాకాశంలో మేఘాలవంటి ఆ సంఘటనలను సాక్షిగా చూడటం నేర్చుకోవాలి. వాటికి మనమే దర్శకులము, నటులం, ప్రేక్షకులము అని గ్రహించి ఆత్మ ఒక్కటే నిజమని దానితో జీవిస్తే అదే మనమౌతాము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం


## గమనిక

మీ చందా గడువు **ఈ నెలతో** ముగియుచున్నది. కావున మీ చందాను **2008-09** సంవత్సర కాలానికి **రు॥ 150/-**లను స్వయంగాగాని, డిడి రూపంలో గాని పంపి **రెన్యువల్** చేయించుకోవలసినదిగా కోరడమైనది.